# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :260 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 22-12-2024 | పేజీలు:4 వెల: 2.00


## నిర్లక్ష్యానికి విద్యార్థి బలి..!

వనపర్తి : పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం ఒక విద్యార్థి నిండుప్రాణాన్ని బలిగొంది. బిడ్డపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు కడుపు కోతను మిగిల్చింది. ఉజ్వల భవిష్యత్తు ఉన్న ఓ విద్యార్థి శనివారం విద్యుదాఘాతానికి గురై క్షణాల్లో ప్రాణాలను కోల్పోయాడు.వివరాల్లోకి వెళితే.. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం పెద్దమారు గ్రామానికి చెందిన శిరీష –భాస్కర్ రావు కుమారులు హరీష్ (15), గౌతమ్ లు వనపర్తి శివారులోని తిరుమలయ్య గుట్ట వద్ద ఉన్న రెడియంట్ పాఠశాల హాస్టల్ లో ఉండి చదువుతున్నారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న హరీష్, లోకేష్ లు ఎవరికీ తెలియకుండా ఉదయాన్నే పక్కనే ఉన్న వేరుశనగ పొలం వద్దకు వెళ్లారు. పొలానికి పెట్టిన కరెంట్ వైర్లు గమనించని హరీష్ వేరుశనగ కోసం దాటే%శీ%దుకు ప్రయత్నిస్తుండగా.. విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు.అది చూసిన మరో విద్యార్థి వెంటనే పాఠశాల యాజమాన్యానికి సమాచారం అందించారు. అప్పటికే విద్యార్థి మృతి చెందాడు. విద్యార్థి మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు బిడ్డను చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ సంఘటనతో మిగిలిన విద్యార్థులను లోపల ఉంచి ఉపాధ్యాయులు పాఠశాలకు

## మీరు కోరినట్లు చేస్తే మేం ప్రతిపక్షంలో ఉంటాం: సీఎం రేవంత్




హైదరాబాద్, ప్రతిపక్ష నేత కేసీఆర్ వచ్చి రైతు భరోసా మీద సలహాలు ఇస్తారని అనుకున్నానని, సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే రావట్లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో భూభారతి, రైతు భరోసాలపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు.బీఆర్ఎస్ హయాంలో క్రషర్ యూనిట్లకు, మైనింగ్ భూములకు రైతు బంధు ఇచ్చారు. లేఅవుట్లు వేసి.. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన వాళ్లకు కూడా రైతు బంధు ఇచ్చారు. రోడ్డు విస్తరణలో పోయిన భూమికి కూడా రైతు బంధు ఇచ్చారు.మేము ఇచ్చినట్లు గానే కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వాలని కేటీఆర్ అంటున్నారు. మీరు ఇచ్చినట్లు ఇస్తే..మేము ప్రతిపక్షం లో ఉంటాం. ఆ తర్వాత బయటకు వెళ్లాల్సి వస్తుంది. కేసీఆర్ చేసిన ఘనకార్యానికి ఇప్పుడు ఆయన సభకు రాలేకపోతున్నారు..గుట్టలు, రోడ్డు, రియలెస్టేట్ వెంచర్లకు రైతు భరోసా ఇవ్వాలా? వద్దా? బీఆర్ఎస్ సమాధానం చెప్పాలి. మా ప్రభుత్వం సూచనలను తీసుకోవడానికి సిద్ధం గా ఉంది. బీఆర్ఎస్ సభలో ఎంత చిల్లరగా వ్యవహరించినా ఓపికతో ఉన్నాం' అని రేవంత్ అన్నారు.

అబద్ధాల సంఘానికి అధ్యక్షుడు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ప్రవర్తన, చిత్ర విచిత్ర వేషాలు ప్రజలు గమనిస్తున్నారు. అబద్ధాల సంఘానికి అధ్యక్షుడు సభకు రాలేదు. ఉపాధ్యక్షుడు వచ్చారు.మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి రైతుభరోసాపై సలహాలు ఇస్తారనుకున్నాం. కానీ అలా జరగడం లేదు.గత పదేళ్ల పాలనపై సభ్యులు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే సభకు రావడం లేదేమోఒకసారి అధికారం.. మరోసారి డిపాజిట్లు కోల్పోయిన బీఆర్ఎస్ నేతల తీరు మారడం లేదు. మీరు లక్ష రూపాయల రుణమాఫీ చేయడానికి ఆపసోపాలు పడ్డారు. కానీ మేం మీలా కాదు. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా రుణమాఫీ చేశామని అన్నారు.

కొండలు, గుట్టలు, లే అవుట్లకు రైతు భరోసా ఇవ్వాలా..

హైదరాబాద్: కొండలు, గుట్టలు, లే అవుట్లకు కూడా రైతు భరోసా ఇవ్వాలా అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. దొంగ పాస్ పుస్తకాలు తయారు చేసి రైతు బంధు తీసుకున్నారని ఆరోపించారు. తెలంగాణ అసెంబ్లీ వేదికగా రైతు భరోసాపై జరిగిన చర్చలో సీఎం రేవంత్ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దల అనుచరులం, బంధువులమని వేల కోట్లు కొల్లగొట్టారని విమర్శించారు. 80వేల పుస్తకాలు చదివినవారు వచ్చి రైతు భరోసాపై సలహా ఇస్తారు అనుకున్నామని అన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని రైతు భరోసా ఇవ్వాలని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. వారు కాదు తమకు ఆదర్శమని... వాళ్లను ఆదర్శంగా తీసుకుంటే తాము ఇక్కడ ఉండేవారం కాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు.2023లో ఓడిపోయారు, ఆ తర్వాత డిపాజిట్లు పోయాయని... ఇకముందు ఊడ్చుకు పోతారని విమర్శించారు. వ్యవసాయ దారులు తమకు ఆదర్శమని ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ చిత్ర, విచిత్ర వ్యవహారాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. రైతు భరోసా ఎవరికి ఇవ్వాలో సూచనలు ఇవ్వాలని అన్నారు. అబద్ధాల సంఘం అధ్యక్షుడు సభకు రాలేదని ఎద్దేవా చేశారు. ఉపాధ్యక్షుడు సభకు వచ్చి రైతు ఆత్మహత్యలపై అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు.2014లో 898 మంది, 2015లో 1358, 2016లో 632 మంది మొత్తంగా 3వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.2014 నుంచి16 మధ్య NCRB ప్రకారం రైతు ఆత్మహత్యల్లో భారతదేశం రెండో స్థానంలో ఉందన్నారు. 2019లో డిసెంబర్‌లో కేంద్ర మంత్రి ఇచ్చిన సమాధానమిదని.. ఇది అందరూ తలదించుకునే విషయమని చెప్పారు. దీన్ని కూడా కొంతమంది గొప్పగా చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓడినా మనుషులు మారలేదని... మాటలు మారడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు.

## రాజకీయ సన్యాసం తీసుకుంటా.. రేవంత్‌కి కేటీఆర్ సవాల్



హైదరాబాద్ : ఈ రాష్ట్రంలో ఏ ఒక్క ఊరిలోనైనా వంద శాతం రుణమాఫీ జరిగినట్టు నిరూపిస్తే.. స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా వెంటనే ఇచ్చి రాజకీయ సన్యాసం తీసుకుంటానని అధికార పక్షానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ చేశారు. శాసనసభలో రైతుభరోసాపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు.అసెంబ్లీ ఎన్నికలకు ముందు రుణాలు తెచ్చుకోండి అని ఇదే రేవంత్ రెడ్డి అన్నారు. డిసెంబర్ 9న రుణమాఫీపై మొదటి సంతకం పెడుతా అన్నారు. ఏకకాలంలో ఒకటే పెన్ స్ట్రోక్‌తో రుణమాఫీ చేస్తా అన్నారు. డిసెంబర్ 7న స్టేట్ లెవల్ బ్యాంకర్స్ మీటింగ్‌లో రుణమాఫీ కోసం రూ. 49 వేల 500 కోట్లు అని చెప్పారు. ఎక్కడో సీఎం మాట్లాడుతూ.. ఒక్క సంవత్సరం కడుపు కట్టుకుంటే రుణమాఫీ చేసేస్తాం. రూ. 40 వేల కోట్లు కట్టేస్తాం అన్నారు. సీఎం రూ. 40 వేల కోట్లు అంటే.. కేబినెట్‌కు వచ్చే వరకు రూ. 31 వేల కోట్లు, బడ్జెట్‌కు వచ్చేసరికి రూ. 26 వేల కోట్లు అయింది. మొన్న జరిగిన పాలమూరు విజయోత్సవ సభలో రూ. 19 వేల కోట్లు అని సీఎం చెప్పారు. ఈ ప్రభుత్వాన్ని సవాల్ చేస్తున్నాం.. ఈ రాష్ట్రంలో ఏ ఊరికైనా పోదాం.. కొండారెడ్డిపల్లే, సిరిసిల్ల, పాలేరు పోదాం.. వాళ్ల ఇష్టం. ఏ ఒక్క ఊరిలో నైనా వంద శాతం రుణమాఫీ జరిగిందని చెబితే స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా వెంటనే ఇచ్చి రాజకీయ సన్యాసం తీసుకుంటాం. ఈ రకమైన బుకాయింపు, మోసం ప్రభుత్వానికి మంచిది కాదు. రుణమాఫీ చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు అని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు.రైతుబంధు ఎందుకు ఆగిపోతది అని రేవంత్ రెడ్డి అన్నారు. ఆ పథకం ఆపేందుకు హౌలాగాళ్లమా అని రేవంత్ రెడ్డి అన్నారు. మరి వానకాలం రైతుబంధు ఎందుకు ఎగ్గొట్టారు. ముఖ్యమంత్రి మాటల్లో ఇప్పుడు వారిని ఏమనాలి..? ఒక పంట కాదు మూడు పంటలకు రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు రేవంత్ రెడ్డి. మేం కూడా మూడు పంటలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాను. కౌలు రైతుకు, భూ యజమానికి రైతుబంధు ఇస్తామన్నారు. తప్పకుండా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. మొదటి వంద రోజుల్లోనే రైతుభరోసా ఇస్తామని చెప్పి మాట నిలబెట్టుకోలేదు. అప్పుడేమో అందరికి అని ఇప్పుడేమో కొందరికి అని కోతలు పెట్టారు. రైతుభరోసారకు బడ్జెట్‌లో రూ. 15 వేల కోట్లు కేటాయించారు. 70 లక్షల మంది రైతన్నలకు రూ. 23 వేల కోట్లు కావాలి. రైతుబంధు కోతలకు సిద్దపడ్డ తర్వాతనే కేబినెట్ సబ్ కమిటీ వేశారు. మంత్రివర్గ ఉపసంఘం వేసి టైం పాస్ చేస్తున్నారు. వానకాలం రైతుబంధు ఎగ్గొట్టినట్టే.. ఇప్పుడు కూడా రైతుబంధు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారు. మేనిఫెస్టోలో కోతల గురించి ఎందుకు చెప్పలేదు. ఈ రాష్ట్రంలో కోటి పైచిలుకు పాన్ కార్డులు ఉన్నాయి. వీళ్లకు కట్ చేస్తామంటే ఎలా..? ఐటీ కట్టే వాళ్లకు కట్ చేస్తామంటే ఎలా..? రైతుబంధు పథకానికి ఉరి వేయబోతున్నారని మా అనుమానం అని కేటీఆర్ పేర్కొన్నారు.

## రైతులను అవమానించిన మీరు నీతులు చెప్తారా..



హైదరాబాద్: రైతులకు రేవంత్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. సంక్రాంతి నుంచి రైతు భరోసా అమలు చేస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ప్రభుత్వ ప్రకటనపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ వేదికగా మంత్రి తుమ్మల రైతు భరోసాపై ఈ కీలక ప్రకటన చేశారు. రైతు భరోసాపై ప్రభుత్వం సబ్‌కమిటీ ఏర్పాటు చేసిందని తెలిపారు. రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించామని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతు భరోసా కింద రైతులకు రూ.80 వేల కోట్లు ఇచ్చిందని అన్నారు. గతంలో సాగుచేయని భూములకు కూడా రైతుబంధు ఇచ్చారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తుచేశారు. ఏడో రోజు తెలంగాణ అసెంబ్లీ, శాసనమండలి సమావేశాలు ఇవాళ(శనివారం) ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యాయి. గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్–2024 బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. అలాగే సభ ముందుకు తెలంగాణ మున్సిపాలిటీల 2024 బిల్లు, తెలంగాణ పంచాయతీరాజ్ బిల్లు 2024ను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. తెలంగాణ భూ భారతి బిల్లును మండలిలో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. రైతు భరోసాపై మండలిలో స్వల్పకాలిక చర్చ జరుగుతుంది.

రైతు భరోసాలో కోత పెడతామని చెప్పలేదు: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రైతు భరోసాలో కోత పెడతామని తాము ఇప్పటి వరకు చెప్పలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సభ్యుల అభిప్రాయం తర్వాతనే తమ నిర్ణయం ప్రకటిస్తామని అన్నారు. జీఓ 231 ప్రకారం పంట వేసిన వారికి రైతు బంధు ఇవ్వాలని ఉందని గుర్తుచేశారు. పంట వేయని వారికి రైతు బంధు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు.దాని వల్ల రూ.20వేల కోట్లు పంట వేయని రైతుల చెబుల్లోకి వెళ్లిందని మాత్రమే సభ ముందు సమాచారం పెట్టామన్నారు. రూ. 7620కోట్ల రైతు బంధు ఒకేసారి రైతుల ఖాతాలో వేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు వేశారు: మంత్రి సీతక్క

రాష్ట్రంలో రైతులకు బేడీలు వేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిది అని మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. సన్న వడ్లు వేస్తే ఉరి అన్నది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో రుణమాఫీ ఎందుకు కాలేదని నిలదీశారు. కేవలం వడ్డీ మాత్రమే మాఫీ అయిందన్నారు. మీరు అన్ని చేస్తే, రూ.30 వేల కోట్లు ఇంకా రైతులపై రుణం ఎందుకు ఉందని అడిగారు. ఫామ్ హౌస్‌లు ఉన్నవారికి కూడా రైతు భరోసా ఇవ్వాలా చెప్పాలని నిలదీశారు. రైతు భరోసాపై మీ వైఖరి ఏంటో చెప్పాలని మంత్రి సీతక్క అన్నారు.

అందుకే సభ ఆలస్యమైంది: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మాజీ మంత్రి హరీష్‌రావును ఉద్దేశించి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడారు. సభ ఎప్పుడు పెద్దగా ఆలస్యం కాలేదని చెప్పారు. ఈరోజు జీరో వరకు తీసుకోవాలనే అంశం మీద చర్చ జరిగిందని అన్నారు. అందుకే సభ ప్రారంభానికి కొద్దిగా ఆలస్యమైందని చెప్పారు. అయితే హరీష్‌రావు వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్ రెడ్డి అభ్యంతరం తెలిపారు. ఏదో ఒక సాకుతో సభ సరిగా జగరడం లేదని చెప్పాలని బీఆర్ఎస్ భావిస్తోందని ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ఇప్పటి వరకు సభకు రాకుండా సభ గౌరవాన్ని తగ్గించాలని చూస్తున్నారని యెన్నెం శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు.

## మద్యం పాలసీ కేసులో కీలక పరిణామం..

న్యూఢిల్లీ, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ షాక్ తగిలింది.మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు లో కేజ్రీని విచారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఈ కేసులో డిసెంబర్ 5న మాజీ సీఎంను విచారిచేందుకు ఈడీ అనుమతి కోరగా.. అందుకు ఎల్జీ తాజాగా పర్మిషన్ ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఎల్జీ కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసినట్లు సదరు వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి.ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆయనను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మే 10 నుంచి జూన్ 1 వరకు ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరైంది. జూన్ 2న ఆయన మళ్లీ జైలులో లొంగిపోగా, జూన్ 20న ట్రయల్ కోర్టులో బెయిల్ దక్కింది. బెయిల్‌ను ఈడీ సవాల్ చేయడంతో జూన్ 25న హైకోర్టు బెయిల్ ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. జూన్ 26న ఇదే కేసులో కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేసింది. జూలై 12న ఈడీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ సీబీఐ



అప్పటికే అరెస్టు చేయడం వల్ల ఆయన జైలులోనే ఉండాల్సి వచ్చింది. ఇక సెప్టెంబర్ 13న సీబీఐ కేసులోనూ కేజ్రీకి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ దక్కడంతో ఆరునెలల పాటు జైలుజీవితం గడిపిన ఆయన చివరికి సెప్టెంబర్ 14వ తేదీన తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ కేసులోనే ఈడీ మరోసారి కేజ్రీవాల్‌ను విచారించేందుకు సిద్దమవుతోంది.

## కేటీఆర్‌కు చెక్ పెట్టేందుకు హరీశ్‌ను వాడుకుంటున్నారా?



హైదరాబాద్,సిఎం రేవంత్ రెడ్డి కేటీఆర్– హరీశ్‌రావు మధ్య చీలిక తెచ్చే ఆట మొదలు పెట్టారా? హరీశ్ రావుతోనే కేటీఆర్‌కు చెక్ పెట్టే ప్లాన్ వేస్తున్నారా? అసెంబ్లీ సాక్షిగా రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతం? హరీశ్‌రావు కోరిక మేరకే ఒఆర్ఆర్ లీజ్ టెండర్ల విచారణ జరిపిస్తున్నారా.? రేవంత్ వాఖ్యల వెనుక వ్యూహం అదేనంటూ పొలిటికల్ సర్కిల్స్‌లో పుకార్లు చక్కర్లు కొడుతోంది.. ఏడాది క్రితం వరకు తిరుగులేని పార్టీగా ఉన్న బీఆర్ఎస్ ఇప్పుడు అష్టకష్టాలను ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, లోక్‌సభ ఎన్నికల్లో ఘోర పరాజయం, ఆ తర్వాత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వలసలు.. వరుస ఎదురుదెబ్బలతో గులాబీ పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు కేసులు, విచారణలు కూడా విరుచుకుపడుతున్నాయి. గులాబీ బాస్ కేసీఆర్ విశ్రాంతి తీసుకుంటున్నారు. పీకల్లోతు కష్టాల్లో ఉన్న కారు స్టీరింగ్‌ను కేటీఆర్ తన చేతుల్లోకి తీసుకున్నారు. ఇంతలో ఈ–కారు రేస్ కేసు స్పీడ్ బ్రేకర్‌లా అడ్డొచ్చిపడింది. ఈ–కారు రేసును మించిన వేగంతో కేసు దర్యాప్తు మొదలైంది.. కేటీఆర్‌ను ఎ–1 గా చేర్చి ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసింది ఏసీబీ. మరోవైపు ఈడీ కూడా రంగంలోకి దిగి వివరాలు ఇవ్వాలంటూ ఏసీబీకి లేఖ పంపించింది. ఈ పరిణామాలు చూస్తుంటే.. ఏ క్షణంలోనైనా కేటీఆర్ అరెస్ట్ కావచ్చునే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఓ వైపు ఈ–కారు రేస్ కేసు రైజింగ్‌లో ఉన్న టైమ్‌లో హఠాత్తుగా ఔటర్‌రింగ్ రోడ్డు లీజు టెండర్ల అంశం తెరపైకి రావడంతో రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఔటర్ రింగ్ రోడ్డును గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 7వేల కోట్ల రూపాయలకు ఓ ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టిందని కాంగ్రెస్ సర్కార్ ఆరోపిస్తోంది. ఈ అంశంపై విచారణ జరిపిస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో ఇది ఎక్కడికీ దారితీస్తోందోనన్న చర్చ జరుగుతోంది. ఒ.ఆర్.ఆర్ లీజ్ టెండర్లపై విచారణ జరిపిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి పదే పదే హరీశ్‌రావు పేరును ప్రస్తావించడమే బిగ్ డిబేట్ పాయింట్‌గా మారింది. హరీశ్‌రావు కోరిక మేరకే ఒ.ఆర్.ఆర్ టెండర్లపై సిట్ విచారణ జరిపిస్తామని నొక్కి మరీ చెప్పడం వెనుక రేవంత రెడ్డి ఆంతర్యమేంటనే చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది.. ఓఆర్ఆర్ లీజుపై అభ్యంతరాలుంటే.. రద్దు చేయండని హరీశ్‌రావు కామెంట్ చేస్తే.. హరీశ్‌రావు కోరిక మేరకు విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి చెప్పడంలో ఏదో స్టాటజ్రీ ఉందనే అనుమానాలు బీఆర్ఎస్ కేడర్‌ను వెంటాడుతున్నాయి. సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యల్ని రాజకీయ వర్గాలు గుర్తు చేసుకుంటున్నాయట. తెలంగాణలో కేసీఆర్ ఉనికి లేకుండా చేస్తామని.. కేసీఆర్‌ను రాజకీయంగా మర్చిపోయేలా చేస్తామని రేవంత్ రెడ్డి చాలాసార్లు అన్నారు. హరీశ్‌రావును వాడుకొనే కేటీఆర్‌కు చెక్ పెడతామని హింట్ కూడా ఇచ్చారు. ఇప్పుడు హరీశ్‌రావు కోరిక మేరకే అని అనడంతో.. అప్పటి రేవంత్ మాటల్ని రివైండ్ చేసుకుంటున్నారట. చెప్పినట్టే.. హరీశ్‌రావును వాడుకొని రేవంత్ తన పొలిటికల్ గేమ్ స్టార్ట్ చేశారనే చర్చ ఊపందుకుంది. బావ–బావమరుదులకు మధ్య మనస్పర్థలు సృష్టించే రాజకీయ చదరంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి మొదలు పెట్టారన్న టాక్ వినిపిస్తోంది. ఔటర్‌రింగ్ రోడ్డు లీజ్ టెండర్లు హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో జరిగాయి. అప్పుడు కూడా మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఉన్నారు. కాబట్టి ఒ.ఆర్.ఆర్ టెండర్ల తీగ లాగితే.. అది మళ్లీ కేటీఆర్‌కే ఉచ్చులా బిగుసుకునేలా చేస్తుందని టాక్.

## నేనేమైనా ఉగ్రవాదినా.. అప్రమత్తంగా లేకపోతే ఎన్‌కౌంటర్ చేసేవారు

బెంగళూరు: 'నేనేమైనా ఉగ్రవాదినా..' రెండు దశాబ్దాల రాజకీయంలో వ్యక్తిగతంగా ఎవరినీ కించపరచలేదు, సంస్థాగతంగా రాజకీయంగా మాత్రమే మాట్లాడుతా... అటువంటిది నన్ను టార్గెట్ చేసి చిత్రహింసలకు గురి చేశారని బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవిఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం బెళగావి నుంచి బెంగళూరు కోర్టుకు తరలిస్తుండగా దావణగెరె సమీపానికి చేరేసరికే హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో పోలీసులు విడుదల చేశారు. అనంతరం సీటీ రవి, ప్రతిపక్షనేత అశోక్, బీజేపీ అధ్యక్షుడు విజయేంద్రలతో కలసి మీడియాతో మాట్లాడారు.తనగురించి చిక్కమగళూరులో తెలుసుకోవాలన్నారు. తనను విమర్శించే మంత్రులు, డీసీఎం కూడా తన వ్యవహార శైలి గురించి తెలుసుకోవాలన్నారు. కాగా సువర్ణసౌధలోనే డీసీఎం డీకే శివకుమార్, మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌లు ప్రాణాలు తీస్తామని హెచ్చరించారన్నారు. తాను ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పోలీసులు ఎన్‌కౌంటర్ చేసేవారని ఆరోపణలు చేశారు. ఇదే విషయాన్ని బెళగావి ఐదో జేఎంఎఫ్‌సీ కోర్టు న్యాయమూర్తి వద్ద వివరించానన్నారు. సువర్ణసౌధలోనే అరెస్టు చేశారని ఆ తర్వాత రాత్రంతా పలు పోలీస్ స్టేషన్‌లకు తిప్పారని న్యాయమూర్తికి వివరించానన్నారు.ఖానాపుర పోలీసులు తనను శారీరకంగా మానసికంగా హింసించారన్నారు. తన మొబైల్, వాచ్ లాగేసుకున్నారన్నారు. తనను ఎన్‌కౌంటర్ చేయాలని పథకం వేశారన్నారు. వారికి ప్రతి పదినిమిషాలకోసారి పోలీసులకు ఫోన్‌లు వస్తున్నాయని, ఎవరు మార్గదర్శకం చేస్తున్నారో తెలియదని, తన కుటుంబసభ్యులకు కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. సువర్ణసౌధలో తాను మంత్రి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయలేదన్నారు.కానీ సువర్ణసౌధలో మూడుసార్లు దాడి చేసినా ఫిర్యాదు చేస్తే



పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. ఓ ప్రజాప్రతినిధిగా తన పట్ల అనుచితంగా వ్యవహరించారన్నారు. ప్రతిపక్షనేతలు అశోక్, ఛలవాది నారాయణస్వామిలు తనను చూసేందుకు వస్తే రెండున్నరగంటలపాటు అవకాశం ఇవ్వలేదన్నారు. గురువారం మధ్యాహ్నం కారిడార్‌లో చిక్కమగళూరుకు నీ శవమే పోతుందని మంత్రి బెదరించారన్నారు.నిజంగా నాకు ప్రాణహాని ఉందని భయపడ్డానన్నారు. నన్ను మానసికంగా ఇబ్బంది పెట్టారని, చివరకు సవదత్తి సమీపంలోని క్రషర్ ఫ్యాక్టరీ వద్దకు తీసుకెళ్లి ఎఫ్ఐఆర్ కాపీని పదినిమిషాలు చూపి లాగేసుకున్నారన్నారు. సీటీ రవి అరెస్టును ఖండిస్తూ అభిమానులు, కార్యకర్తలు చిక్కమగళూరులో బంద్ పాటించారు. బెళగావిలో ప్రతిపక్షనేత ఆద్వర్యంలో నిరసన తెలపగా బెంగళూరు ఫ్రీడంపార్కులో బీజేపీ నాయకులు నిరసన చేపట్టారు.

## సంపాదకీయం

ఆదివారం 22-12-2024

# కళతప్పుతున్న సినిమా రంగం

వినోదం, విజ్ఞానం అందించే సినిమా రంగం కళ తప్పుతోంది. అసత్యం, అతిశయోక్తి సినిమాలు ఊపందుకున్నాయి. మాస్ మసాల సినిమాలు నిర్మాతలకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో వస్తున్న సినిమాల్లో కమర్షియల్ హంగులు తప్ప, వినోదం, విజ్ఞానం అనే మాటే లేకుండా పోయింది. ఆనాటి మాయాబజార్, లవకుశ లాంటి సినిమాలు రజతోత్సవాలు, శతదినోత్సవాలు జరుపుకున్నాయి. వందల కోట్ల వ్యయంతో ఇప్పుడు నిర్మిస్తున్న సినిమాలు పట్టున పది రోజులు కూడా ఆడటం లేదు. గత కొంత కాలంగా కమర్షియల్ సినిమాల జోరు పెరగడంతో నిర్మాతల పంటపండుతుంది. హీరోల ప్రాధాన్యత పెరుగుతోం ది, కాని అదంతా వ్యాపారం, సమాజహితం ఇసుమంతైనా లేకపోవడం విచారకరం. రక్తపాతం, హింస, దోపిడీ, అశ్లీల నృత్యాలు సినిమాలకు కథాంశాలుగా మారిపోయాయి. కళారూపాలన్నింటిలోనూ మనకు అత్యంత ముఖ్యమైంది సినిమా అంటుంటారు. సినిమాలు రాకముందు వీధి నాటకాలు ప్రదర్శించేవారు. ఆనాటి నాటకాల్లో వినోదం, విజ్ఞానం, చరిత్ర, వర్తమానం, మానవత్వం, నిజాయితీ, దేశభక్తి, సామాజిక చైతన్యం, సాంఘిక బాధ్యతలతో పాటు కళాత్మకతను ప్రేక్షకులకు అందించారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజుల్లో సినిమా రంగం కూడా అదే ఒరవడిని కొనసాగించింది. సినిమాల ద్వారా సమాజంలో మెరుగైన మార్పును ఆశిస్తుంటారు. ప్రేక్షకులపై సినిమా ప్రభావం ఆ స్థాయిలో ఉంటుందని నమ్ముతుంటారు. అందుకే, సినిమాల నుండి సమాజ హితాన్ని ఆశించిన ప్రభుత్వాలు ఈ రంగానికి ఎంతో ప్రాధాన్యతను ఇస్తూ వస్తున్నాయి. అనేక రాయితీలు కల్పిస్తున్నాయి. సినీ పరిశ్రమకు పలు ప్రయోజనాలు కలిగిస్తున్నాయి. కాలక్రమేణా సిని పరిశ్రమలో వ్యాపార ధర్మం పెరిగింది. సమాజ హితం విస్మరించింది. వ్యాపారం చేసుకొని లాభాల కోసం సినిమాలు నిర్మించే నిర్మాతల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నది. అందువల్లనే మాస్ మసాల సినిమాలు జోరందుకున్నాయి. హింస, రక్తపాతం, దోపిడీ కథాంశాలుగా మారిపోయాయి. దేశ సంపదను దోచే వారిని హీరోలుగా చూపించే పరిస్థితి దాపురించింది.ఇలాంటి సినిమాల వల్ల అనేక ఘోరాలు, నేరాలు, అనర్థాలు, అవాంఛనీయ సంఘటనలు జరుగుతున్నాయి. గ్రామీణుల నిజజీవితాలకు దగ్గరగా ఉన్న 'బలగం' సినిమా ఇటీవల ఓ సంచలనం. ఆ సినిమా తీయడానికి చేసిన ఖర్చు కూడా చాలా తక్కువ. నటీనటులు పెద్దగా పేరున్నవారు కాదు. అయినా జనజీవితాలను హత్తుకున్న బలగం స్థాయిలో, వందల కోట్ల రూపాయల పెట్టుబడితో నిర్మించిన మాస్ మసాలా సినిమాలు ప్రేక్షకుల ఆదరణ పొందలేకపోయాయి. ఊరూరా 'బలగం' సినిమాను చూడనివారంటూ లేరంటే అతిశయోక్తి కానేకాదు. ఇటీవల విడుదలైన ఆర్ఆర్ఆర్, పుష్ప – 2 సినిమాలు, డబ్బులు సంపాదించాయే తప్ప, సామాన్య ప్రేక్షకుల నుండి ఆ స్థాయిలో ఆదరణ పొందలేకపోయాయనేది జగమెరిగిన సత్యం. సినిమా అంటే అలా ఉండాలని తెలుగు ప్రేక్షకులు కోరుకుంటున్నారనడానికి ఇంతకు మించిన ఉదాహరణ మరొకటి లేదనుకుంటాను. వినోదం, విజ్ఞానం, కళాత్మకత, దేశభక్తి, సమాజ హితం, మానవత్వం, నిజాయితీ, కుటుంబ అనుబంధాలు ఇతివృత్తంగా సినిమాలు వచ్చిన రోజుల్లో సినిమా హాళ్లు ప్రేక్షకులతో కిక్కిరిసిపోయాయి. బండెనుకబండి కట్టుకొని గ్రామీణులు సమీప పట్టణాల్లోని సినిమా థియేటర్లకు వచ్చిన రోజులను విస్మరించలేం. ఆనాటి సినిమాలు విలువలతో కూడిన సమాజ హితాన్ని ఆశించి నిర్మించబడ్డాయి. నిర్మాతలు లాభాపేక్ష లేకుండా దేశభక్తితో సినిమాలు తీశారు. నటీనటులు కూడా మానవత్వానికి, నిజాయితీకి విలువనిచ్చారు.వినోదంతో పాటు సందేశం ఉండే విధంగా సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చేవి. కాలం మారింది. నిర్మాతల ప్రాధాన్యత తగ్గింది. అనేక సినిమాలకు దర్శకుడు, హీరో తప్ప నిర్మాత ఎవరనేది ప్రేక్షకునికి తెలియని పరిస్థితి ఏర్పడింది.హీరోకు అనుగుణంగా నిర్మాతలు సినిమాలు తీస్తున్నారు. మాస్ మసాల జోడించి పది రోజులు ఆడితే చాలు జేబులు నింపుకోవచ్చు అనే ధోరణితో వ్యవహరిస్తున్నారు. దీంతో సమాజంలో దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పుడు వచ్చే సినిమాల్లో కమర్షియల్ హంగులు తప్ప వినోదం, విజ్ఞానం మచ్చుకైన కనిపించవు. హింస, రక్తపాతం, దోపిడీదారులను హీరోలుగా చిత్రీకరించడంతో సినిమాల వల్ల ఎన్నో ఘోరాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల ఒక సినిమా విడుదలైంది. ఆ సినిమాను ప్రేక్షకుల మధ్య కూర్చొని చూసేందుకు హీరో థియేటర్‌కు వచ్చాడు. ఈ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒక మహిళ మృతి చెందగా, ఆమె కుమారుడు చావు బతుకుల మధ్య ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ కేసుకు సంబంధించి హీరోపై పోలీసులు చట్టపరమైన చర్యల్లో భాగంగా జైలుకు పంపించారు. ఆ హీరో జైలులో అడుగు పెట్టిన వెంటనే, ఆగమేఘాల మీద యంత్రాంగమంతా కదిలింది. రాత్రి పొద్దుపోయిన తర్వాత జైలు లోపలికి వెళ్లిన ఆ హీరో తెల్లవారే సరికే ఇంటికి చేరుకున్నారు.ఆయనను పరామర్శించడానికి సినిమా రంగం వరస కట్టింది. కాని సినిమా విడుదల సందర్భంగా చనిపోయిన మహిళ కుటుంబాన్ని పరామర్శించడానికి ఏ ఒక్క సినీ ప్రముఖుడు ముందుకు రాలేదు. ప్రేక్షకుల ఆదరాభిమానాలతో కోట్లకు కోట్లు సంపాదించుకొని సెలెబ్రిటీగా సమాజంలో గుర్తింపు పొందుతున్న సినీరంగం ఆదే ప్రేక్షకుల విషయంలో ఎంత చిన్నచూపుతో వ్యవహరిస్తుందనడానికి ఈ సంఘటనే సరైన ఉదాహరణ.

# ఏ ఇంట్లోకైనా మీడియా చొచ్చుకు వెళ్లవచ్చా ?

హైదరాబాద్,సినీ నటుడు మోహన్ బాబు ఫ్యామిలీ వ్యవహారంపై కొంత కాలంగా సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. సెలబ్రిటీలు, సామాన్యులు ఇలా ఎవరి ఇంట్లోకి అయినా అనుమతి లేకుండా మీడియా చొచ్చుకు వెళ్లవచ్చా అనేది ప్రశ్న. ఎవరిదైనా ప్రైవేటు స్థలం లేదా భవనంలోకి ఇతర వ్యక్తులు ప్రవేశించాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని చట్టం చెబుతోంది. భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 329 ప్రకారం, అనుమతి లేకుండా ఇతరుల భవనాలు, స్థలాల్లోకి చొరబడటం ట్రెస్ పాసింగ్ అనే నేరం కిందకు వస్తుంది. దానికి సందర్భం, కారణాలను బట్టి మూడు నెలలు, ఏడాది వరకు జైలు శిక్ష ఉందని చట్టం చెబుతోంది. ఈ విషయంలో జర్నలిస్టులకు ఎలాంటి మినహాయింపు లేదు. భారతదేశ చట్టాల ప్రకారం జర్నలిస్టులు, సామాన్య పౌరులు అంతా సమానమే. మీడియా వారైనా సరే, ఏ సామాన్యుడి ఇల్లు అయినా, సెలబ్రిటీ ఇల్లు అయినా వారి గోడ దాటి అనుమతి లేకుండా లోపలికి ప్రవేశిస్తే వారిపై ఆ భవన యజమాని కేసు పెట్టవచ్చు. బ్లిక్ పర్సనాలిటీల వ్యక్తిగత వ్యవహారంపై ప్రజలందరికీ ఉత్సాహం ఉంటుంది. అందుకే మీడియా దాన్ని రిపోర్ట్ చేయవలసి వస్తుంది. అదే సందర్భంలో మీడియాపై భౌతిక దాడి సరికాదు. తప్పు చేస్తే చట్టపరంగా వెళ్లాలి అనేది జర్నలిస్టుల వాదన. చొరబడటంలో కూడా చాలా రకాలున్నాయి. ఆయుధాలతో రావడం, రహస్యంగా రావడం, గోడ దూకడం, రాత్రి వేళ రావడం, గేట్లు పగలగొట్టడం.. ఇలా నేరాన్ని బట్టి కేసు తీరు మారుతుంది. ఒకవేళ వేరే వారు అక్కడ గేట్లు పగలగొట్టినా ఆ దారిలో మీడియా వాళ్లు వెళ్ళడం కూడా చట్ట ప్రకారం నేరమే. ఈ స్థలం ఫలానా వారిది ట్రెస్పాసర్స్ విల్ బి ప్రాసిక్యూటెడ్ అని సాధారణంగా కొన్ని ఖాళీ స్థలాల దగ్గర బోర్డులు పెడుతుంటారు. అనుమతి లేకుండా ప్రవేశించిన వారు శిక్షార్హులు అని దీనర్థం. నిబంధన ఇంటికి, ఇతర ప్రైవేటు స్థలాలకు కూడా వర్తిస్తుంది. మీడియా వారికి, సెలబ్రిటీలకు కూడా ఇందులో మినహాయింపు లేదు. కాకపోతే, అమెరికా వంటి దేశాల్లో ఇది అందరూ పాటిస్తారు. మనదేశంలో చట్టాలపై అవగాహన తక్కువ కాబట్టి, ఎక్కువ మంది దీన్ని గౌరవించరు. కానీ, ఎవరైనా గట్టిగా నిలబడి కేసు పెడితే, కచ్చితంగా చొరబాటు చేసిన వారికి శిక్ష పడుతుంది అంటున్నారు న్యాయనిపుణులు. అంతేకాదు, తమ స్థలం లేదా భవనంలోకి చొచ్చుకు వస్తున్న వారిని ఆపే హక్కు కూడా ఆ స్థల యజమానులకు ఉంటుంది. అయితే దాని అర్థం భౌతిక దాడులు చేయవచ్చని కాదు. వారిని ప్రవేశించకుండా ఆపవచ్చు అని మాత్రమే చట్టం చెబుతోంది. సాధారణంగా దొంగతనం కోసం, దాడులు చేయడం కోసం, ఆక్రమణ కోసం ఎవరైనా ప్రాపర్టీలోకి వస్తే ట్రెస్పాసింగ్ కేసులు పెడతారు. కానీ మాట్లాడటం కోసం, సమాచారం కోసం, లేదా అసలు ఏ ఉద్దేశం లేకుండా ఊరికే ఇతరుల స్థలంలోకి వెళ్లినా కేసు పెట్టవచ్చా అంటే అవుననే చెబుతోంది చట్టం. అంటే ఇక్కడ చొరబాటుదారుని లక్ష్యం ముఖ్యం కాదు. కాకపోతే ఉద్దేశాన్ని బట్టి శిక్ష తీవ్రత మారవచ్చు. కానీ, అసలు ఏ చెడు ఉద్దేశం లేకుండా వెళ్లినా నేరం నేరమే.ందుకంటే, రేపు ఎవరో ఒకరు నీ ఇంటి ముందుకు వచ్చి కూర్చుంటారు. నాకే ఉద్దేశమూ లేదు. ఊరికే మీ ఇంటి ముందు నుంచుంటా అంటే చెల్లదు కదా? బోర్డు పెట్టినా, పెట్టకపోయినా, ప్రతి ప్రైవేటు ఆస్తి మీద యజమానికి హక్కు సహజంగా ఉంటుంది. శివసేన నాయకుడు ఉద్ధవ్ ఠాక్రే జర్నలిస్టులపై 2020లో ఈ తరహా కేసు పెట్టించారు. తన నివాసంలోకి అక్రమంగా చొరబడ్డారు అంటూ రిపబ్లిక్ టీవీ రిపోర్టర్, కెమెరా పర్సన్, ఆ బండి నడిపిన డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. అలాగే 2018లో చెన్నైలోని ఒక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థను వీడియో తీస్తున్న ఇద్దరు ఫ్రెంచ్ జర్నలిస్టులపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. అంటే ఈ విషయంలో ఎవరికీ మినహాయింపులు లేవని స్పష్టమవుతోంది. చట్ట ప్రకారం పోలీసులు కూడా ప్రైవేటు ప్రాపర్టీలోకి వెళ్లడానికి స్పష్టమైన కారణం ఉండాలి. ఒకటి వారికి ఎవరైనా ఫిర్యాదు చేసి ఉండాలి లేదా, వారికి అక్కడ తీవ్రమైన నేరం, తక్షణం ఆపించాల్సిన నేరం జరుగుతోందన్న కచ్చితమైన సమాచారం వచ్చి ఉండాలి, లేదా కోర్టు లేదా ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన సమాచారం వచ్చి ఉండాలి. అప్పుడే మాత్రమే పోలీసులు ప్రైవేటు ప్రాపర్టీలోనికి అడుగు పెట్టగలరు.



అయితే భారతదేశంలో చాలా వరకు ఈ చట్టం మీద అవగాహన లేకపోవడం, అవగాహన ఉన్న వారు కూడా పోలీసులతో అనవసర గొడవ ఎందుకు అనుకుని ఊరుకోవడం సహజంగా కనిపిస్తుంది. ఇక, చొరబడటం మాత్రమే కాదు ఒక వ్యక్తి వెంటపడటం, వెంబడించడం కూడా శిక్షార్హమైన నేరమే. తరచూ వెంటబడటం, ఎక్కడకు వెళ్లినా వెనకాలే వెళ్లడం వంటివి చట్ట ప్రకారం స్టాకింగ్ అనే నేరం కిందకు వస్తాయి. అయితే విస్తృతమైన ప్రజాప్రయోజనం ఇమిడి ఉన్న అంశాల్లో కొన్ని సార్లు మీడియా వెళ్లాల్సి రావచ్చు. అప్పుడు కూడా అది చట్ట వ్యతిరేకమే అయినప్పటికీ విస్తృతమైన ప్రజాప్రయోజనం ఉంది కాబట్టి దాన్ని వెలికితీయడానికి కాస్త రిస్క్ తీసుకోవడం అవసరం అనే వాదన చేయచ్చు. కానీ, అప్పుడు కూడా అది అంతగా ప్రజాప్రయోజనంతో ముడిపడింది అవ్వడం, అందులో కూడా వ్యక్తుల ప్రైవసీకి భంగకరం కాని రీతిలో వ్యవహరించడం లాంటి అంశాలు ముడిపడి ఉంటాయి. చీటికి మాటికీ ఎక్కడ పడితే అక్కడికి మైకులు తీసుకుని దూసుకువెళ్లే అధికారం సాధారణ ప్రజలకు ఎలా ఉండదో మీడియాకు కూడా ఉండదు. దాదాపు పదేళ్ళ క్రితం చిరంజీవి ఇంట్లో ఒక ప్రైవేటు కార్యక్రమం జరిగినప్పుడు ఒక ఇంగ్లీషు పత్రిక ఫోటోగ్రాఫర్ గోడదూకి ఆ కార్యక్రమం లోపలికి వెళ్లారు. అప్పుడు అతనిపై పవన్ కళ్యాణ్ భౌతిక దాడి చేశారు. తరువాత ఫిలిం చాంబర్ లో సినిమా పెద్దలు ఆ ఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. తాజాగా మోహన్ బాబు ఇంటిలోకి మీడియా వెళ్లింది. ఆయనా దాడి చేశారు. ఈ మధ్య ఒక తెలంగాణ నార్కొటిక్స్ అధికారిని ఇంటర్వ్యూ ఇవ్వమంటూ ఒక మహిళా జర్నలిస్టు మీదమీదకు వెళ్లిన ఘటన కూడా ఇటువంటిదే. చిరంజీవి ఘటన సమయంలోనూ ప్రైవసీ అనే అంశం చర్చకు వచ్చింది. మీడియా కూడా తనకున్న పరిమితులు తెలుసుకోవాలి. అందరి ప్రైవసీని మీడియా గౌరవించాల్సిందే. దాన్ని ఉల్లంఘించే హక్కు లేదు. మీడియా కూడా తన పరిమితులు తెలుసుకుని, అక్కడ ఏం జరుగుతోందో చెప్పవచ్చు. రిపోర్ట్ చేయవచ్చు. కానీ ఆవేశపూరిత పరిస్థితులు కుటుంబంలో ఉన్నప్పుడు మధ్యలోకి వెళ్లకూడదు. మీడియా ఆవేశంలో వెళ్లడం పొరబాటు అనిపిస్తుంది. కానీ దానికి ప్రతిగా భౌతిక దాడి చేయడం కూడా సరికాదు. కొందరు అవగాహన లేని మీడియా ప్రతినిధులు అత్యుత్సాహం చూపుతుంటారు. జర్నలిజంలో ఏబీసీడీలు, పాత్రికేయ విలువలు, ఏం చేయాలి, ఏం చేయకూడదు వంటివి తెలియని వారు మీడియాలోకి రావడం వల్ల కూడా సమస్య వస్తోంది. గత కొన్ని రోజులుగా సినీ నటుడు మోహన్ బాబు ఆయన కుమారుడు మనోజ్‌కు మధ్య వివాదం తలెత్తింది. జల్‌పల్లిలోని ఇంట్లోకి తనను రానివ్వలేదంటూ మంచు మనోజ్ మీడియా తీసుకుని ఆ ఇంటివద్దకు వెళ్లారు. అదే సమయంలో సెక్యూరిటీ మనోజ్ దంపతులను లోపలికి అనుమతించలేదు. ఈ క్రమంలోనే మనోజ్ గేటు బద్దలుకొట్టి ఇంట్లోకి వెళ్లారు. అక్కడే ఉన్న మోహన్‌బాబును ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించగా.. ఆయన ఆగ్రహాని గురయ్యారు. అతని మైక్‌తోనే మీడియా ప్రతినిధిని కొట్టారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే తనపై నమోదైన కేసులో మధ్యంతర బెయిల్ ఇవ్వాలంటూ హైకోర్టును ఆశ్రయించారు మోహన్ బాబు. గురువారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం ఆయన విజ్ఞప్తిని తోసిపుచ్చింది.అనంతరం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో ఎవరి తప్పు ఎంత ఉన్నదో...న్యాయస్థానం ఏం చెబుతుందో చూడాలి. హైకోర్టు తీర్పు కోసం తెలుగు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు!

# ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఖర్చు కూడా ఒక ఖర్చేనా?




న్యూఢిల్లీ,ఎన్నికలనేవి ప్రజాస్వామ్యంలో పండుగ వంటివి. పండగ ఖర్చును చూసి ఎవరూ భయపడరు. ఉన్నవాడు లేని వాడు అంతా తమకు ఉన్న దాంట్లో పండగ చేసుకుంటారు. అలాంటి ప్రజాస్వామ్య పండుగకు ప్రభుత్వం చేసే ఖర్చును బూచీగా చూపించి మోడీ సర్కార్ జమిలీ ఎన్నికలను ముందుకు తెచ్చింది. నిజానికి ఖర్చు మాట పైకి చెబున్నది. లోగుట్టు వేరే. ప్రపంచంలో ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థలో ఎన్నికల ఖర్చు కూడా ఒక ఖర్చేనా అనిపిస్తుంది సామాన్యుడికి సైతం. ఎన్నికల ఖర్చు ఆదా అంటే.. అది ఎన్నికల నిర్వహణ ఖర్చు ఆదానా లేక రాజకీయ పార్టీలు పెట్టే ఖర్చులు తగ్గించుకునేందుకా! లోక్ సభ ఎన్నికలు ఒక సారి, అసెంబ్లీ ఎన్నికలు ఒక సారి వస్తే.. రెండు సార్లు నేతలు ఓటుకు నోటు ఇవ్వాలి, ప్రచారానికి భారీగా ఖర్చు పెట్టాలి, మందు ముక్క కు ఖర్చు పెట్టాలి.. అదే ఒకేసారి ఎన్నికలు వచ్చేస్తే ఖర్చులో ఖర్చు తగ్గిపోతుంది! అసెంబ్లీ ఎన్నికలకు, లోక్ సభ ఎన్నికలకు రెండు సార్లు నోటు ఇవ్వాల్సిన పని ఉండదు, ఇక ప్రచార ఖర్చు అయితే మరింతగా తగ్గిపోతుంది! బహుశా నేతలకు ఒకేసారి ఖర్చు చేసి ఐదేళ్ల పాటు ఇష్టానుసారం వ్యవహరించుకోవ డానికే ఈ జమిలి ఎన్నికల ఆలోచన కాబోలు! అయితే ఈ మాత్రం ఆలోచన, ఈ మాత్రం జ్ఞానం అమెరికా వంటి దేశానికి ఎందుకు లేదో మరి. అక్కడి ప్రతి నాలుగేళ్లకూ ఒకసారి ఎన్నికలు పెట్టుకున్నారు. శతాబ్దాల నుంచి అలాగే కొనసాగిస్తూ ఉన్నారు! మన దగ్గర ప్రధానికి అవకాశం ఐదేళ్లు, ముఖ్యమంత్రికి అవకాశం ఐదేళ్లు.. అన్ని ప్రజాస్వామ్య బద్ధ పదవులకూ ఐదేళ్ల కాలాన్ని ఇచ్చింది భారతరాజ్యాంగం. అమెరికాలో మరీ నాలుగేళ్లే అవకాశం. ఐదేళ్లతో పోలిస్తే నాలుగేళ్లు ఒక ఏడాది ముందుగానే గడిచిపోతాయి. సర్దుకోవడానికి ఏడాది పడుతుంది, చివరి ఏడాది ఎన్నికల ఏడాది. మధ్యలో మిగిలింది రెండేళ్ల సమయమే.. అయితే ఏ అమెరికన్ ప్రెసిడెంట్ కూడా నాలుగేళు మరీ తక్కువ కాలం, దాన్ని ఐదేళ్లు చేయాలనో, ఆరేళ్లు చేయాలనో వాదించలేదు! అలా తమ పదవీ కాలాన్ని పెంచుకునే ప్రయత్నాలనూ చేయలేదు! ఎన్నికల ఖర్చు గురించి తెగ బాధపడిపోతూ ఇప్పుడు భారత ప్రభుత్వం ఒక దేశం ఒక ఎన్నికలు అంటూ వాదిస్తూ ఉంది. అయితే ఏదైనా 'ఒకే' అనేది భారత్‌కు వర్తింపచేయటం చాలా కష్టం. అసలు కుదరదు. ఎందుకంటే మనది భిన్నత్వం! భిన్నత్వంలో ఏకత్వమే భారత ప్రజాస్వామ్యానికి ఊపిరి పోస్తూ వచ్చింది. అయితే మరీ ముఖ్యంగా 2014 నుంచి ఒకటే ఒకటే.. అనే మాట బాగా వినిపిస్తూ ఉంది. ఒకటే భాష, ఒకటే మతం, ఒకటే పౌరసత్వం, ఒకటే ఎన్నిక.. ఇలాంటి వాదనలు ముఖ్యమైన పదవుల్లోని వారి నుంచి వినిపిస్తూ ఉన్నాయి. ఒక్కక్కటిగా సాధించుకుంటూ ఉన్నారు! మరి ఇప్పుడు ఒకేసారి ఎన్నికలు జరిగిపోతే ఆ తర్వాత ఐదేళ్లు ఇక ఏం చేసినా అడిగే వారు ఉండరనా!మొన్నటి వరకూ మోడీజీకి చాలా కష్టం ఉండేది. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలంటే కర్ణాటక చుట్టూ నెల రోజుల పాటు తిరగాలి, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలంటే మహారాష్ట్ర కు తనే సీఎం అభ్యర్థిని అన్నట్టుగా ప్రచారం చేయాలి.. ఇలా దేశంలో ఎక్కడ అసెంబ్లీ ఎన్నికలు వచ్చినా.. ప్రధానిగా కన్నా.. ఆ రాష్ట్రానికి తనే సీఎం క్యాండిడేట్ అన్నట్టుగా మోడీ ప్రచారం చేసి పెట్టే వాళ్లు! మరి ఈ ఇబ్బంది వద్దనే.. ఒక దేశంలో అన్ని రాష్ట్రాలకూ, అన్ని లోక్ సభస్థానాలకూ ఎన్నికలు జరిగేస్తే? ఆ తర్వాత మోడీ కి ఇలా ముఖ్యమంత్రి అభ్యర్థి తరహాలో ప్రచారం చేయాల్సిన అవసరం తప్పుతుంది! ఇక ఆయన ఎంచక్కా ప్రధానిగా తన పనుల్లో మునిగిపోవచ్చు. అలాగే యూపీ అసెంబ్లీ ఎన్నికలంటే పెట్రో ధరలను పెంచకుండా కొన్నాళ్లు ఓపిక పట్టే వారు,ఎన్నికల షెడ్యూల్ వచ్చిన రోజు నుంచి పోలింగ్ ముగిసే రోజు వరకూ ధరల హెచ్చులు ఉండేవి కావు. అలాగే కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలున్నప్పుడు కొన్ని ప్రజాకర్షక పథకాలు ఉండేవి. ఇక వాటి అవసరం కూడా ఉండదు. ఎలాగూ దేశమంతా ఐదేళ్లకు ఒకసారి అన్ని ఎన్నికలూ అయిపోతాయి కాబట్టి ఇక ఆ రెన్నాళ్లూ ప్రజాకర్షక పథకాలు అమలు చేస్తే చాలు, ఆ తర్వాత ఐదేళ్లూ ఆడింది ఆట, పాడింది పాట! కార్పొరేట్లకు వంత పాడుకోవచ్చు,సామాన్య ప్రజలు మరో ఐదేళ్ల వరకు సైలెంట్‌గా మూలనపడి ఉంటారు.

## భారీ అగ్ని ప్రమాదం...

జైపూర్, రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఓ పెట్రోల్ బంక్ వద్ద ఘోర అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం జైపూర్‌లోని అజ్మీర్ రోడ్డులో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద ఆగి ఉన్న సీఎన్‌జీ ట్యాంకర్‌ను మరో ట్రక్ ఢీకొట్టింది. దీంతో ట్యాంకర్‌లో మంటలు చెలరేగడంతో అది ఒక్కసారిగా పేలిపోయింది. పక్కనే ఉన్న వాహనాలకు మంటలు వ్యాపించడంతో వాహనాలు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు సజీవ దహనమయ్యారు. మరో మందికిపైగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. 22 ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. గాయపడిన వారిని సవాయ్ మాన్‌సింగ్ హాస్పిటల్‌కు తరలించారు. వారికి ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు.

# తేమశాతంలో తేడా వస్తే చర్యలు తప్పవు

అమరావతి, తేమశాతంలో సేవాకేంద్రం వద్ద ఎంత రీడింగ్ వస్తే మిల్లు వద్ద కూడా అంతే రీడింగ్ రావాలని.. కానీ దానిలో మార్పు ఉంటే చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. కృష్ణా జిల్లా గంగూరులో రైతు సేవాకేంద్రాన్ని సీఎం చంద్రబాబు, మంత్రులు నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సేవ కేంద్రంలో ఓ రైతుతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. రైతు నుంచి ధాన్యం ఎలా సేకరిస్తారో సీఎంకు సేవాకేంద్రం సిబ్బంది చూపించారు. ధాన్యం తాను ఎలా అమ్ముతున్నది సీఎం చంద్రబాబుకు రైతు ఆకునూరి సాంబశివరావు వివరించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పంట చాలా బాగా పండిందని రైతు వెల్లడించారు. మిషన్ కోత వల్ల రూ. 5, 6 వేలు ఎకరానికి ఈ ఏడాది కలిసి వచ్చిందని రైతు తెలిపారు. దీనికి దిగుబడి పెరగడం కూడా కారణమని రైతు సాంబశివరావు తెలిపారు. గడ్డిని బయోఫ్యూయల్ ప్లాంట్ వాళ్లు తీసుకుంటే మరో రూ.5వేలు వరకూ వస్తుందని రైతు తెలిపారు. గతంలో మనుషులు కోస్తే ఎకరానికి రూ. 6వేలు కోతకు, మరో రూ. 6వేలు కుప్ప వేయడానికి అయ్యేదని రైతు తెలిపారు. తొలకానికి మరో రూ. 3 వేలు ఖర్చు అయ్యేదని అన్నారు. ఈ లెక్కన అన్ని కలుపుకుని మనుషుల ద్వారా వ్యవసాయం చేస్తే రూ. 25వేలు దాకా ఖర్చు వచ్చేదని చెప్పారు. ధాన్యం డబ్బుల్లో కోత లేదు.. డబ్బులు కరెక్టుగానే వస్తున్నాయని చెప్పారు. ఇప్పుడు ఉన్న వ్యవస్థ బాగానే పనిచేస్తోందని అన్నారు. కోత మిషన్లు బయటనుంచి వస్తున్నాయని వివరించారు. ప్రొక్యూర్మెంట్‌కు షెడ్యూలింగ్ మొత్తం ఒకటిగా లేదా... వేర్వేరుగా పంట కోత కోస్తే పార్ట్ షెడ్యూలింగ్ ఇస్తామని సీఎం చంద్రబాబుకు సేవాకేంద్రం సిబ్బంది వివరించారు. రైతుకు దిగుబడి ఎంత వస్తుందో కూడా నమోదు కావాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఎవరి దగ్గరైనా బాగా పంట పండితే సాగు పద్ధతులు ఏంటో తెలుసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. వరి పంట వేసే రకం తినగలిగేది అయి ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు. టెక్నాలజీని ఉపయోగించుకొని ఏ గ్రామంలో ఎంత ప్రోడెక్టివిటీ వచ్చిందో చెప్పాలని అన్నారు. ధాన్యం తేమశాతాన్ని ఎలా గణిస్తారో స్వయంగా సీఎం చంద్రబాబు పరిశీలించారు. సీజన్ ముందు అన్ని మిషన్లను తేమ విషయంలో క్యాలిబ్రేట్ చేస్తామని అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు.

# తెలంగాణ భవన్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు

హైదరాబాద్, తెలంగాణ భవన్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఫార్ములా ఈ–కార్ రేసులో ఏసీబీ కేసు నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అధికారులు భద్రత ఏర్పాటు చేశారు. కాగా, కాంగ్రెస్ సర్కార్ కుటిల ప్రయత్నంతో ఫార్ములా ఈ–కార్ రేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుపై కేసు నమోదైంది. ఈ–కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్లు దుర్వినియోగం చేశారనే అభియోగంతో కేటీఆర్‌పై ఎంఏయూడీ సెక్రటరీ దానకిశోర్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై ఇప్పటికే పథకం ప్రకారం గవర్నర్ అనుమతి సైతం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఐఏఎస్ దానకిశోర్‌తో ఫిర్యాదు చేయించి, అరెస్టు చేసేందుకు కుట్రలు పన్నిందని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి. గవర్నర్ నుంచి అనుమతి లభించిన వెంటనే ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని మంగళవారం సీఎస్ శాంతికుమారి ఏసీబీకి లేఖ రాశారు. దీంతో బుధవారం సాయం త్రం ఎంఏయూడీ సెక్రటరీ దాన కిశోర్ ఏసీబీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ఏసీబీ డీఎస్పీ మాజిద్ అలీఖాన్ తెలిపారు. ఎన్నికల నియమావళిని ధిక్కరిస్తూ, ప్రభుత్వ అనుమతి లేకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండా రూ.54,88,87,043 కోట్లను యూకేకు చెందిన 'ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్' (ఎఫ్ఈఓ) కంపెనీకి హిమాయత్‌నగర్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి బదిలీ చేయించారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఇతరులపై కేసు నమోదు చేశారు. ఐసీపీ (బీఎన్ఎస్) 13(1) (ఏ), 13(2), సీపీయాక్ట్ 409, 120 (బీ) సెక్షన్స్ కింద అభియోగాలు మోపారు. ఈ మేరకు నాంపల్లి ఏసీబీ కోర్టుకు ఏసీబీ అధికారులు వివరణ ఇచ్చారు. రూ.10 కోట్లకు మించి బదిలీ జరిగితే ప్రభుత్వం, ఆర్థికశాఖ అనుమతి అవసరమని, సీజన్ 10 ఫార్ములా ఈ రేసింగ్‌కు స్పాన్సర్స్ లేక పోవడంతో హెచ్ఎండీఏ నిధులు మళ్లించారని, దీంతో విదేశీ కంపెనీకి చెల్లింపులతో హెచ్ఎండీఏకు అదనపు పన్ను భారమైందని దానకిశోర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేటీఆర్ సహా ఇతర అధికారులను విచారించేందుకు ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ బంజారాహిల్స్‌లోని కేంద్ర కార్యాలయంలో ప్రత్యేకంగా ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా బృందాన్ని విచారణ కోసం ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ఈ టీమ్‌లో పది మంది సిబ్బంది ఉన్నట్టు సమాచారం. విచారణ వివరాలు ఎప్పటికప్పుడు ఏసీబీ ఉన్నతాధికారికి, వారి నుంచి ప్రభుత్వానికి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో కేటీఆర్‌కు త్వరలోనే విచారణ నోటీసులను ఏసీబీ అధికారులు ఇవ్వనున్నారు. ఇప్పటికే కేటీఆర్ ప్రెస్‌మీట్ పెట్టి రాష్ట్ర ప్రజలకు ఈ–కార్ రేస్ గురించి వాస్తవాలు వెల్లడించడంతో ఆయనను అక్రమంగానైనా అరెస్టు చేస్తారనే ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే పలు అక్రమ అరెస్టులతో ప్రభుత్వానికి చెడ్డపేరు రావడంతో కేటీఆర్ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో అసెంబ్లీ ముగిసిన వెంటనే నోటీసులు అందజేస్తారని సమాచారం.

## విచారణకు హాజరైన దువ్వాడ శ్రీనివాస్

శ్రీకాకుళం జిల్లా, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాధురితో కలసి పోలీసుల విచారణకు హాజరయ్యారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై దువ్వాడ అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో అతనిపై స్థానిక జనసేన నేతలు చేసిన ఫిర్యాదుతో కేసు నమోదైంది. నవంబర్ 18 న కేసు నమోదు చేసిన టెక్కలి పోలీసులు.. దువ్వాడకు 41 ఏ నోటీసులు ఇచ్చి.. విచారణకు రావాలని పేర్కొన్నారు. దీంతో దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం మధురితో కలిసి విచారణకు వచ్చారు. కాగా ఆంధ్రప్రదేశ్‌లో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్‌సీపీ నేతలపై అనేక కేసులు నమోదు కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో తాజాగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు టెక్కలి పోలీసులు షాక్ ఇచ్చారు. విచారణకు హాజరుకావాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు 41ఏ నోటీసులు జారీ చేసింది. తాజాగా దువ్వాడ శ్రీనివాస్‌పై జనసేన కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పవన్ కళ్యాణ్‌పై దువ్వాడ శ్రీనివాస్ తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో స్పందించిన పోలీసులు.. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దువ్వాడ శ్రీనివాస్‌కు నోటీసులు జారీ చేశారు. అయితే నోటీసులపై స్పందించిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్.. ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా తాను భయపడేది లేదన్నారు. టీడీపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జనసేన కార్యకర్తలు దౌర్జన్యానికి పాల్పడ్డారని,

## కొరియర్‌లో డెడ్‌బాడీ..
## పశ్చిమగోదావరి జిల్లాలో కలకలం

న్యూఢిల్లీ, పార్లమెంట్‌లో శీతాకాల సమావేశాలు శుక్రవారం ముగిశాయి. విపక్ష సభ్యుల ఆందోళనల నేపథ్యంలో ఉభయసభలను నిరవధికంగా వాయిదా వేశారు. అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై విపక్ష ఎంపీలు నిరసన వ్యక్తం చేస్తుండగానే స్పీకర్ ఓం బిర్లా లోక్ సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఆ సమయంలో ప్రధాని మోదీ కూడా సభలో ఉన్నారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీలో 12 మంది రాజ్యసభ సభ్యులకు చోటు కల్పించాలని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్‌వాల్ ప్రవేశపెట్టిన తీర్మానానికి రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఆ తర్వాత అమిత్ షా వ్యాఖ్యలపై సభలో విపక్ష ఎంపీలు నిరసనకు దిగడంతో రాజ్యసభను నిరవధికంగా వాయిదా వేశారు. దాంతో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఇవాళ్టితో ముగిసినట్లయ్యింది. శుక్రవారం ఉదయం ఉభయసభల ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద .. ఇండియా కూటమి ఎంపీలు నిరసన చేపట్టారు. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వారు తప్పుపట్టారు. షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానించిన షా రాజీనామా చేయాలన్నారు.

## ఏం జరిగింది?

హైదరాబాద్, హైదరాబాద్?లోని హుస్సేన్ సాగర్ చుట్టూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 2.8 కిలోమీటర్ల ట్రాక్‌లో 2023 ఫిబ్రవరి 10,11 తేదీల్లో నిర్వహించిన మొదటి ఫార్ములా-ఈ కార్ల పోటీకి దేశ వ్యాప్తంగా అభిమానులు హాజరయ్యారు. అది విజయవంతం కావడంతో 2024 ఫిబ్రవరి 10న మరో మారు నిర్వహించాలని భావించారు. అయితే 2023 డిసెంబర్?లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఒప్పందంలో పేర్కొన్న అంశాలను పాటించకపోవడంతో తాము హైదరాబాద్ రేస్ నుంచి తప్పుకొంటున్నట్లు అదే నెలలో ఫార్ములా-ఈ ఆపరేషన్స్ ప్రకటించింది. దాంతో సెషన్ రద్దు అయ్యింది. ఈ పోటీల నిర్వహణలో ఉల్లంఘనలు జరిగాయని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. బోర్డు, ఆర్థికశాఖ నుంచి ముందస్తు అనుమతి లేకుండా రూ. 55 కోట్లను విదేశీ సంస్థకు హెచ్ఎండీఏ చెల్లింపులు చేయడం ప్రధాన అభియోగం. దీనిపై వివరణ ఇవ్వాలని గతంలో పురపాలకశాఖ బాధ్యతలు నిర్వహించిన సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్?కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మెమో సైతం జారీ చేశారు. సీఎస్ మెమోకు సమాధానం ఇచ్చిన అర్వింద్ కుమార్ ప్రక్రియ త్వరగా జరగాలన్న ఉద్దేశంతోనే చెల్లింపులు చేశామని పురపాలక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోనే జరిగిందని వివరణ ఇచ్చారు. ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ), ఏస్ నెక్స్ట్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్, పురపాలకశాఖ మధ్య 2022 అక్టోబర్ 25న త్రైపాక్షిక ఒప్పందం కింద లాంగ్-ఫాం ఎల్ఎఫ్ఏ జరిగిందని ఆయన తెలిపారు. 9,10,11,12 సీజన్ల కార్ రేసులు నిర్వహించేలా ఈ ఒప్పందం కుదరిందని తెలిపారు. తొమ్మిదో సీజన్ కార్ రేస్?ను 2023 ఫిబ్రవరి 10, 11 తేదీల్లో హైదరాబాద్?లోని నెక్లెస్ రోడ్?లో నిర్వహించారని అప్పటి పురపాలకశాఖ మంత్రి ఆమోదంతోనే ఒప్పందం కుదిరిందని, శాఖాధిపతిగా తాను ఎంఓయూ చేశానని అర్వింద్ కుమార్ పేర్కొన్నారు. ప్రతి సీజన్?లో పెట్టుబడి పెడతానన్న ప్రమోటర్ తొలి సీజన్?లో తనకు నష్టం వచ్చిందంటూ లేఖలు రాసినట్లు పురపాలకశాఖ పేర్కొంది. పదో సీజన్?కు వచ్చే సరికి ప్రమోటర్?గా ఉండేందుకు ఏస్ నెక్స్ట్?జెన్ ప్రైవేట్ లిమిటెడ్ ముందుకు రాలేదు. ఒప్పందాన్ని రద్దు చేసుకోలేదు. హైదరాబాద్?లో రేసు నిర్వహించేందుకు ఎఫ్ఈఓ ఆసక్తి చూపిందని, తగిన సమయం లేదనందువల్ల ప్రత్యామ్నాయ ప్రమోటర్?ను ఖరారు చేయడంలో జాప్యం జరుగుతున్నందున పదో సీజన్ నిర్వహణపై ముందుకెళ్లాలని పురపాలక శాఖ మంత్రి సూచించారని వివరించారు. నిధుల చెల్లింపునకు సంబంధించి సెప్టెంబర్ 25న ఎఫ్ఈఓ నుంచి వచ్చిన మెయిల్ ఆధారంగా 2023 సెప్టెంబర్ 27న మంత్రికి ఫైల్?ను సర్క్యులేట్ చేసి హెచ్ఎండీఏను ప్రమోటర్?గా, హోస్ట్ సిటీగా చేర్చామన్న ఆయన తర్వాత ప్రమోటర్?తో ఎఫ్ఈఓ ఒప్పందాన్ని రద్దు చేసుకొందని పేర్కొన్నారు. దీంతో త్రైపాక్షిక ఒప్పందం కాస్తా ఎఫ్ఈఓ, హెచ్ఎండీఏల మధ్య ద్వైపాక్షిక ఒప్పందంగా మారినట్లైంది. ఎఫ్ఈఓకు అక్టోబర్ ఐదో తేదీన 23 కోట్లు, 11న మరో రూ. 23 కోట్లు కలిపి మొత్తం రూ. 46 కోట్లను హెచ్ఎండీఏ నుంచి చెల్లించారు. పన్నుల కింద మరో రూ. 9 కోట్లు కూడా హెచ్ఎండీఏ చెల్లించింది. రేసులో హెచ్ఎండీఏ ప్రమోటర్?గా చేరినా అందుకు బోర్డు ఆమోదం తీసుకోలేదని ప్రభుత్వం గుర్తించింది. ఎఫ్ఈఓ, హెచ్ఎండీఏ మధ్య ద్వైపాక్షిక ఒప్పందం 2023 అక్టోబర్ 30న కుదిరింది. దాని కంటే ముందే హెచ్ఎండీఏ డబ్బులు చెల్లించింది. అక్టోబర్ 11న రెండో దఫాగా రూ. 23 కోట్లు చెల్లించడానికి ముందే ఎన్నికల షెడ్యూల్ వెలువడిందని, అయిప్పటికీ ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోలేదని ప్రభుత్వం గుర్తించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మరోవైపు రూ. 43 కోట్లను పౌండ్లుగా మార్చి ఎఫ్ఈఓకు చెల్లించిందని, ఇలా చెల్లించాలంటే రిజర్వ్ బ్యాంకు అనుమతి అవసరమని, అనుమతి తీసుకోపోవడం ఉల్లంఘనల కిందకు వస్తుందని ఏసీబీకి ఇచ్చిన ఫిర్యాదులో పురపాలకశాఖ పేర్కొంది. ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారంలో ఒప్పందం కుదరడానికి ముందే నిధులు చెల్లించడం, నిబంధనలకు విరుద్ధంగా విదేశీ కరెన్సీ రూపంలో ఇవ్వడంపై ప్రభుత్వం విచారణ చేపట్టింది. ఈ అంశంపై విచారణ చేపట్టాలని అవినీతి నిరోధక శాఖకు అక్టోబర్ నెల చివరి వారంలో పురపాలకశాఖ లేఖ రాసింది. అటు హైదరాబాద్ నగరం, తెలంగాణ ప్రతిష్ట పెంచేందుకు ఫార్ములా-ఈ రేసును తీసుకొచ్చేందుకు ఎంతగానో కృషి చేశామన్న అప్పటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ తదుపరి సెషన్ నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు ఉండరాదన్న ఉద్దేశంతోనే తాము నిధుల చెల్లింపుపై నిర్ణయం తీసుకున్నామని మీడియాకు తెలిపారు. పురపాలక శాఖ మంత్రిగా, హెచ్ఎండీఏ వైస్ ఛైర్మన్?గా తాను అప్పటి హెచ్ఎండీఏ కమిషనర్?గా ఉన్న అర్వింద్ కుమార్?కు ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. హెచ్ఎండీఏకు ఛైర్మన్?గా ఉన్న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అనుమతి కూడా ఉందని తెలిపారు. ఇందులో ఎలాంటి తప్పు లేదని త్రైపాక్షిక ఒప్పందంలోని సంస్థ తప్పుకోవడంతో రేసు నిర్వహణ కోసం నిర్ణయం తీసుకున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. ఎలాంటి ఉల్లంఘనలు చోటు చేసుకోలేదని, ఎక్కడా దుర్వినియోగం జరగలేదని ఆయన వివరించారు. విచారణ కోరుతూ ఏసీబీకి లేఖ వచ్చినప్పటికీ బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసి విచారణ జరపాలంటే వారి స్థాయిని బట్టి ప్రభుత్వం అనుమతి తీసుకోవాల్సి ఉంది. దీంతో అప్పటి పురపాలకశాఖ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్?పై ఎఫ్ఐఆర్ నమోదుకు అనుమతి కోసం గవర్నర్?కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. అప్పటి పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్?పై కేసు నమోదుకు ప్రభుత్వం ఇప్పటికే అంగీకారం తెలిపింది. ఈ మేరకు ఏసీబీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేఖ రాశారు. అప్పటి చీఫ్ ఇంజనీర్?పై కేసు నమోదు చేసి, విచారణ జరిపేందుకు కూడా పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి అంగీకారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ లేఖపై మొదట న్యాయ సలహా కోరిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తాజాగా కేటీఆర్‌పై విచారణకు అనుమతి ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# భారత్‌కు ట్రంప్ బెదిరింపు!



వాషింగ్టన్, కాబోయే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాలన ఎలా ఉండబోతోందో ఇప్పటికే ఒక అంచనా ఏర్పడింది. ఆయనలో బెదిరింపు దోరణి ఎక్కువగా కనిపిస్తోంది. అగ్రరాజ్య అధినేత అనే అహంకారం అది. తమ ఉత్పత్తులను దిగుమతి చేసుకొనే ఏ దేశమైనా వాటి మీద పన్నులు విధిస్తే తాము కూడా దెబ్బకు దెబ్బతీస్తామని అలాంటి దేశాలలో భారత్ కూడా ఉందని ట్రంప్ ఓపెన్‌గా చెప్పాడు. తొలిసారి అధికారానికి వచ్చినపుడు చైనాపై వాణిజ్యపోరును ప్రారంభించటమే కాదు, మన దేశం నుంచి చేసుకొనే దిగుమతులపై ప్రాధాన్యత వ్యవస్థ విధానం(జిఎస్‌పి)లో భాగంగా ఇస్తున్న రాయితీలను కూడా రద్దు చేసిన పెద్దమనిషి ట్రంప్. మనదేశాన్ని తమ వలలోకి లాక్కొనేందుకు అంతకు ముందు అమెరికా విసిరిన బిస్కెట్ వంటిది ఆ రాయితీ. ట్రంప్ చర్యకు ప్రతిగా మనం కూడా అమెరికా ఉత్పత్తులపై పన్ను విధింపుకు పూనుకున్నాం. వాటి మీద ప్రపంచ వాణిజ్య సంస్థలో పరస్పరం మూడేసి కేసులు దాఖలు చేశారు. వాటిని పరిష్కరించుకోవాలని కొద్ది నెలల క్రితం ఇరుదేశాలు ఒక అవగాహనకు వచ్చాయి. ఆ స్ఫూర్తిని దెబ్బతీసేందుకు ట్రంప్ పూనుకున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం అమెరికా నుంచి మనం చేసుకొనే దిగుమతుల కంటే మన ఎగుమతులే ఎక్కువగా ఉండి వాణిజ్య మిగులులో ఉన్నాం. దాన్ని పూడ్చేందుకు తమ వస్తువులను కొనుగోలు చేయాలని లేకుంటే వాణిజ్యపోరుకు దిగుతానని హెచ్చరించటమే ట్రంప్ మాటల అంతరార్ధం. పరస్పరం ఇచ్చిపుచ్చుకోవటమనే పదం ఎంతో ముఖ్యం. వారు ఒక సైకిలు పంపితే మేము మరో సైకిలు పంపుతాం. వారు గనుక వంద లేదా రెండువందల శాతం పన్ను విధిస్తే మేమూ అదే చేస్తాం. చైనా, బ్రెజిల్, భారత్ వంటి దేశాలు అలా చేస్తున్నాయన్నాడు. వారు మార్చుకుంటే మంచిది లేకుంటే మేమూ అదే చేస్తాం అన్నాడు. ప్రపంచ వాణిజ్య సంస్థ సమాచారం ప్రకారం 2023లో రక్షణ చర్యల్లో భాగంగా తృణధాన్యాలపై 193శాతం, పాల ఉత్పత్తుల మీద 188, ఖనిజాలు,లోహాలపై 187, నూనెగింజలు, ఖాద్యతైలాలపై 164, పానీయాలు, పొగాకుపై 150, పండ్లు, కూరగాయలపై 132, రసాయనాలపై 56, కాఫీ, టీ, సుగంధ ద్రవ్యాలపై 53, చేపలు, వాటి ఉత్పత్తులపై 35శాతాల చొప్పున అమెరికా దిగుమతి పన్ను విధిస్తున్నది. దాని నిర్వాకం ఇలా ఉంటే ఇతర దేశాలపై ఎదురుదాడికి దిగుతోంది. జో బైడెన్‌తో మన దేశం కుదుర్చుకున్న అవగాహన ప్రకారం ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై పన్ను తగ్గి ఎగుమతి అవకాశాలు మెరుగుపడతాయని ఆ రంగాల వారు ఆశిస్తుండగా ట్రంప్ చేసిన తాజా ప్రకటనతో పరిస్థితి తిరిగి మొదటికి వస్తుందా? అన్న అనుమానం కలుగుతున్నది. అయితే మీ ఇల్లు మా ఇంటికి ఎంత దూరమో మాదీ అంతే అన్న లోకోక్తి తెలిసిందే. అమెరికా లేకపోతే పూట గడవదు అనే పరిస్థితి ఎవరికీ లేదు, అమెరికాతో సహా అన్ని దేశాలూ ఏదో ఒకదాని కోసం ఇతరుల మీద ఆధారపడాల్సినవే. జపాన్ సంస్థ నోమురా అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ముందు వెల్లడించిన నివేదికలో ట్రంప్ గెలిస్తే రెండు దేశాల మధ్య ఉన్న వాణిజ్య విబేధాలను పక్కన పెడతాడని, చైనాపై ఆంక్షలను పెంచుతాడని, దాని స్థానంలో భారత్‌ను ముందుకు తెస్తాడని, అది ఎంతో ఉపయోగమని చెప్పింది. ఇక ట్రంప్ గతానికి వస్తే మన దేశం గురించి అన్న మాటలు ఇన్నిన్ని కాదు. అయినప్పటికీ 'అబ్‌కి బార్ ట్రంప్ సర్కార్' అంటూ ప్రధాని నరేంద్రమోడీ అమెరికా వెళ్లి మరీ అక్కడ ప్రచారం చేసి వచ్చారు. అయితే గత ఎన్నికల్లో ట్రంప్ మట్టికరిచాడు. మోడీ పరువు గంగలో కలిసింది. దిగుమతి పన్నులను భారత్ దుర్వినియోగం చేస్తున్నదన్నాడు ట్రంప్. ప్రపంచంలో ఎక్కువ మొత్తాలను విధిస్తున్న దిగుమతి పన్నుల చక్రవర్తి వంటి పదాలతో అవమానించాడు. అంతర్జాతీయ లావాదేవీలలో డాలర్‌ను పక్కన పెట్టాలన్న బ్రిక్స్ దేశాలు వెనక్కు తగ్గి అలాంటిదేమీ లేదని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశాడు. లేకుంటే ప్రతికూల చర్యలు తప్పవని బెదిరించాడు. ఇటీవలి సంవత్సరాలలో మనదేశ విదేశీ వాణిజ్య భాగస్వాములలో చైనా, అమెరికా ఒకటి రెండు స్థానాలలో ఉంటున్నాయి. ట్రంప్ ఎన్ని మాటలు మాట్లాడినా అమెరికా అధ్యక్షుడు భారత్‌కు మిత్రుడని, రెండుదేశాల సంబంధాలు మరింతగా విస్తరిస్తాయని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వంటివారు పొగుడుతూనే ఉన్నారు. హెచ్1బి వీసాల గురించి అనేక ఊహాగానాలు సాగుతున్నాయి. గడచిన పదేండ్లలో చూస్తే అవి తగ్గాయి తప్ప పెరగలేదు. అమెరికా విధాన జాతీయ సంస్థ (ఎన్ఎఫ్ఏపి) సమాచారం ప్రకారం 2014-15లో ఉన్న వీసాల సంఖ్యతో పోలిస్తే ఎనిమిదేండ్ల కాలంలో 75శాతం తగ్గాయి, అమెరికాలోని మనదేశ కంపెనీల రిక్రూట్‌మెంట్లు కూడా తగ్గాయి. ట్రంప్ అధ్యక్షుడుగా కొలువు తీరాక నిజంగా ఏం చేస్తాడో చూడాల్సి ఉంది.

# మను దురహంకారం!



న్యూఢిల్లీ,హోంమంత్రి అమిత్ షా సాక్షాత్తూ రాజ్యసభలో బాబా సాహెబ్ డాక్టర్ అంబేద్కర్ పేరును ఉచ్చరిస్తూ చేసిన అహంకారపూరిత వ్యాఖ్యల పట్ల దేశవ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. 75 ఏళ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలోనే- ఆ రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమని, ఆయన తక్షణం క్షమాపణ చెప్పటంతో పాటు తన పదవి నుంచి వైదొలగాలని విపక్షాలు డిమాండు చేశాయి. పార్లమెంటు బయట పెద్దఎత్తున నిరసన తెలిపాయి. బుధవారం కూడా పార్లమెంటులోనూ, దేశవ్యాప్తంగానూ నిరసన కార్యక్రమాలు జరిగాయి. "అంబేద్కర్ అంబేద్కర్ అంబేద్కర్ అంబేద్కర్ అనటం ఫ్యాషనై పోయింది. అదేదో వందసార్లు భగవంతుడి పేరు ఉచ్ఛరించినా స్వర్గలోకంలో స్థానం దొరుకుతుంది." అంటూ అమిత్ షా విపక్షాలపై విరుచుకుపడుతూ, తన మనువాద ధోరణిని బయటపెట్టుకున్నారు. అంబేద్కర్ పేరు ఉచ్ఛరించటమే నేరమన్నట్టుగా అసహనం ప్రదర్శించి, బిజెపి అసలు బుద్ధిని చూపించుకున్నారు. ప్రతిపక్షాలు అభ్యంతరం చెప్పాకైనా ఆయన చేసిన తప్పుకు లెంపలేసుకొని సభను క్షమాపణ కోరాల్సింది. ఆ పని చేయకపోగా అన్ని సందర్భాల్లాగానే ఈసారి కూడా విపక్షాలపై విరుచుకుపడ్డమే విధానంగా హోంమంత్రి, ఆయన పరివార గణమూ వ్యవహరించటం సిగ్గుచేటు. తగుదునమ్మా అని ప్రధాని మోదీ తన అనుంగు అనుచరుడిని వెనకేసుకురావటం, ఎప్పటిలాగానే నెహ్రూని, కాంగ్రెస్‌ని రంగంలోకి లాక్కొచ్చి పాత పాటలే వల్లెవేయడం దబాయింపు ధోరణికి పరాకాష్ట. అమిత్ షా అక్కసు వాక్కులు అప్పటికప్పుడు అనుకోకుండా, ఆవేశపరంగా వచ్చినవి కావు. సంఘ పరివారం అణువణువునా అంబేద్కర్ పట్ల జీర్ణించుకొని ఉన్న అసహనపు భావజాలానికి బహిర్గత వ్యక్తీకరణే అది. దేశానికి దశాదిశా నిర్ణయించుకొని, అంబేద్కర్ అధ్యక్షతన భారత రాజ్యాంగం రూపొందించుకొన్న తరుణంలో నేటి బిజెపి మాతృసంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. తాము అత్యంత ప్రామాణికంగా భావించే మనుస్మృతికి స్థానం లేకుండా పోయిందే అని స్వయంగా గోల్వాల్కర్ తమ ఆర్గనైజర్ పత్రికలో వ్యాసాలు రాసుకున్నారు. దేశానికి ఈ రాజ్యాంగం పనికి రాదని, మూడు రంగుల జెండా అరిష్టమని పేర్కొనటమే కాదుబీ కొంతమంది రాష్ట్ర ప్రేమి యువదళ్ కార్యకర్తలు 2021లో నాగ్‌పూర్ ఆర్ఆర్ఎస్ కార్యాలయం మీద బలవంతంగా మువ్వన్నెల జెండా ఎగురవేసేదాకా వాళ్లు జాతీయజెండాను గుర్తించలేదు. అవకాశం వచ్చిన ప్రతిసారి రాజ్యాంగంపై విరుచుకుపడడం చాలామంది కాషాయదళ నాయకులకు అలవాటే. గత లోక్‌సభ ఎన్నికల తరుణంలో 400 సీట్లు సాధిస్తే రాజ్యాంగం మార్చి తీరుతామంటూ కొంతమంది బిజెపి నాయకులు బాహాటంగా ప్రకటించిన సంగతి విదితమే! నోటితో నవ్వి నొసటతో వెక్కిరించిన తీరుగానే బిజెపి అంబేద్కర్ పట్ల వ్యవహరిస్తూ ఉంటుంది. ఆయన విగ్రహానికి భారీగా పూలదండలు వేసి, ఘనంగా కబుర్లు చెప్పటంబీ రాజ్యాంగం నిర్దేశించిన విలువలను, రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేయడం ఆ పార్టీ కపట నీతి. మనుస్మృతి అత్యంత దుర్మార్గమైనదని, ఈ దేశానికి ఏమాత్రం పనికిరాదని అంబేద్కరే స్వయంగా దానిని దగ్ధం చేశారు. అలాంటి కాలం చెల్లిన క్రూరమైన మనువాదాన్ని నెత్తిన పెట్టుకొని, సనాతనమే తమ అభిమతంగా ఊరేగే బిజెపి గణం ఇక అంబేద్కర్ మహాశయుడి మార్గాన్ని ఎక్కడ గౌరవిస్తుంది? లోన ఒకటి బోధిస్తూ, అభిమానిస్తూ, బయట రకరకాల రంగుల మార్చే నటనా విన్యాసాలు చేయడంబీ అధికార అవసరాలకు తగ్గట్టుగా అబద్ధాలకు తెగించటం సావార్కర్ కాలం నుంచీ సంఘ్ పరివారానికి అలవాటు. వర్ణవ్యవస్థ విషవలయం నుంచి దేశం బయటపడాలన్న ఆధునాతన ఆచరణ అంబేద్కర్‌దైతే, దేశాన్ని మళ్లీ వెయ్యి పడగల విషపు నాగు నీడలోకి లాక్కుపోవడమే బిజెపి సనాతన పన్నాగం. ఈ రెండింటి మధ్య ఆకాశానికి, అథ:పాతాళానికి ఉన్నంత అంతరం ఉంది. ఈ నేపథ్యంలోనే అమిత్ షా అసహనంలోంచి అహంకారపు వ్యాఖ్యలు బయటకొచ్చాయి. ఈ తరహా పెత్తందారీ పోకడలు భారత రాజ్యాంగపు స్ఫూర్తికి ప్రమాదకరం. కాబట్టి హోంమంత్రి అమిత్ షా బుకాయింపు పర్వాన్ని కట్టిపెట్టి, బేషరతుగా క్షమాపణలు చెప్పాలి. రాజ్యాంగబద్ధంగా ప్రాప్తించిన పదవి నుంచి తక్షణమే తప్పుకోవాలి.

# ఈ కార్ రేస్‌పై ఎప్పుడైనా ఎక్కడైనా చర్చకు సిద్ధం

హైదరాబాద్, తెలంగాణలో ఫార్ములా ఈ కార్ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన నేపథ్యంలో సంచలనం రేకెత్తిస్తోంది. గత 2 రోజులుగా ఈ వ్యవహారం రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా, తెలంగాణ అసెంబ్లీలో ఈ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ వ్యవహారంలో చర్చించేందుకు రావాలన్న కేటీఆర్ సవాల్‌పై స్పందించారు. ఈ కార్ రేస్‌పై సభలో చర్చించాలని కేటీఆర్ ఇంతకాలం ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. 'ఈ కార్ రేస్ ప్రతినిధులు వచ్చి నన్ను కలిశారు. రూ.600 కోట్లు పెండింగ్ నిధులు రావాల్సి ఉంది. ఇవ్వమని అడిగారు. మీరు ఊ.. అంటే మరోసారి రేసింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఎఫ్ఈవో ప్రతినిధులు వచ్చి కలిసిన తర్వాతే ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.' అని రేవంత్ వెల్లడించారు. 'హెచ్ఎండీఏ ఖాతాలోని రూ.కోట్ల నిధులు లండన్‌లోని కంపెనీకి నేరుగా ఎలా వెళ్తాయి.?. నిర్వాహకులతో కేటీఆర్ కుదుర్చుకున్న ఒప్పందం విలువ రూ.600 కోట్లు. మిగతా డబ్బు కోసం వాళ్లు వచ్చినప్పుడే ఈ విషయం నా దృష్టికి వచ్చింది. ఓఆర్ఆర్ అమ్మినా.. హెచ్ఎండీఏ నిధులు కాజేసినా.. అడగవద్దన్నట్లు మాట్లాడుతున్నారు. నేను జాగ్రత్త పడడం వల్ల రూ.450 కోట్లు మిగిలాయి. ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై ఏసీబీ విచారణ సాగుతోంది. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ సాగుతోంది కాబట్టి ఎక్కువ వివరాలు వెల్లడించలేను. న్యాయపరంగా చిక్కులు లేకుంటే ఈ వ్యవహారంపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధం. అవసరమైతే బీఆర్ఎస్ కార్యాలయానికి వెళ్లైనా చర్చిస్తాం. రూ.55 కోట్లు చిన్న విషయం కాదు.' అని రేవంత్ పేర్కొన్నారు. కాగా, ఈ ఫార్ములా కార్ రేస్ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలన కలిగిస్తోంది. దీనికి సంబంధించి కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేయగా.. అసలది కేసే కాదని.. ఇది ఓ చిల్లర కేసని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. ఫార్ములా వన్ ఈ కార్ రేస్ వ్యవహారంపై సమాధానం చెప్పేందుకు తాను సిద్ధంగా ఉన్నానని.. అయినా ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. 'హైదరాబాద్‌ను ఇన్నోవేషన్, రీసెర్చ్, మ్యానుఫాక్చరింగ్ హబ్ కావాలనే ఉద్దేశంతోనే ఈ కార్ రేస్ నిర్వహించాం. తాము తొలుత ఫార్ములా - 1తో సంప్రదిస్తే వారు రామన్నారు. ఎన్నో తంటాలు పడి ఒప్పించాం. 2023లో ఫిబ్రవరిలో మేము నిర్వహించిన రేస్ చూసి కేంద్ర మంత్రులు, బడా పారిశ్రామిక వేత్తలు సైతం మెచ్చుకున్నారు. రేవంత్ సర్కార్ కుంభకోణం, లంబకోణం అని కేబినెట్‌లో ఏదో సాధించినట్లు లీకులిస్తున్నారు.' అని మండిపడ్డారు.

### వాట్సాప్‌లోనూ చాట్ జీపీటీ

న్యూఢిల్లీ,కృత్రిమ మేధ వేదిక ఓపెన్ ఏఐ మరో కొత్త సదుపాయం అందుబాటులోకి తెచ్చింది. ఇక నుంచి చాట్‌జీపీటీ కోసం ఎలాంటి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోనక్కర్లేదు. దాని సేవలను నేరుగా వాట్సాప్‌లోనూ వినియోగించుకోవచ్చునని ఓపెన్ ఏఐ ప్రకటించింది.

## సీతారామాంజనేయుల్ని ఎందుకు అరెస్టు చేయలేదు

అమరావతి, పీ హైకోర్టులో నటి జత్వానీ కేసులో నిందితులుగా ఉన్న ఐపీఎస్ అధికారుల ముందస్తు బెయిల్ పై విచారణ జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిది. ఏ 2గా ఉన్న సీతారామాంజనజేయులు కనీసం ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా వేయలేదని ఆయనను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించింది. హీరోయిన్ జత్వానీని వేధించిన కేసులో.. కేసులు నమోదు కావడంతో ఇతర ఐపీఎస్‌లు, పోలీసులు ముందస్తు బెయిల్ కోసంకోర్టుకెళ్లారు. విచారణ పూర్తయ్యే వరకూ వారిని అరెస్టు చేయవద్దని కోర్టు చెప్పింది. తాజా విచారణ తర్వాత కోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. సినీనటి కాదంబరి జత్వానీ ఫోర్జరీ డాక్యుమెంట్‌తో జత్వానీ తన భూమిని విక్రయించేందుకు ప్రయత్నించారని కుక్కల విద్యాసాగర్ ఈ ఏడాది ఫిబ్రవరి 2న ఫిర్యాదు చేశారు. అదే రోజు ఉదయం 6 గంటలకు పోలీసులు కేసు నమోదు చేశారు. తనపై ఏపీ పోలీసులు తప్పుడు కేసు పెట్టి ముంబై నుంచి అరెస్టు చేసితీసుకు వచ్చారని నలభై ఐదు రోజుల పాటు వేదించారని ఆరోపించారు. ప్రభుత్వం మారిన తర్వాత దీనిపై పోలీసులు విచారణ జరిపారు. కుక్కల విద్యాసాగర్ నుంచి ఫిర్యాదు అందకముందే జత్వానీని కేసులో ఇరికించేందుకు పోలీసులు ఉన్నతాధికారులు ప్రణాళిక రచించారని ఆరోపణలు ఉన్నాయి. విజయవాడ డీసీపీగా పనిచేస్తూ విశాఖకు బదిలీ అయిన విశాల్ గున్నీని రిలీవ్ చేయకుండా జత్వానీ కేసును పర్యవేక్షించేందుకు ముంబైకి పంపించారని.. అక్కడి నుంచి వచ్చిన తర్వాతే రిలీవ్ చేస్తామని గున్నీకి అప్పటి విజయవాడ కమిషనర్ కాంతి రాణా చెప్పారని హైకోర్టులో అడ్వకేట్ జనరల్ వదోచన్నరు. క్రమశిక్షణ సంఘం ముందు విశాల్ గున్నీ ఈ మేరకు వాంగ్మూలం ఇచ్చారన్నారు. కేసు నమోదయ్యే సమయానికి ముంబైకి వెళ్లేందుకు ఐపీఎస్ అధికారి విశాల్ గున్ని, ఇతర పోలీసు అధికారులు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. జత్వానీని కేసులో ఇరికించేందుకు పిటిషనర్లు కుట్ర చేశారనేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయిని ఏజీ వాదించారు. కేసు దర్యాప్తు కీలక దశలో ఉంది. మధ్యంతర ఉత్తర్వుల కారణంగా పిటిషనర్లను అదుపులోకి తీసుకుని కుట్రకోణాన్ని వెలికి తీయలేకపోయామని ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే సాక్షులను ప్రభావితం చేస్తారని ఏజీ వాదించారు. నకిలీ డాక్యుమెంట్ ఎవరు సృష్టించారు? జత్వానీపై కేసు నమోదు వెనుక ఎవరున్నారు? ఎవరి పాత్ర ఏమిటి? అనేవి వెలికితీసేందుకు పిటిషనర్ల కస్టోడియల్ విచారణ అవసరమన్నారు. అయితే ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయని ఏ 2 సీతారామాంజనేయుల్ని అరెస్టు చేయకపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నించింది. విచారణ తర్వాత తీర్పు రిజర్వ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది.

## సరదాగా విద్యార్థులతో కాసేపు...

కుప్పం,ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి విద్యార్థులతో ముఖాముఖి సందర్భంగా ఇచ్చిన సమాధానాలలో కాసేపు సరదాగా, కాసేపు సీరియస్‌గా, ఇంకాసేపు గంభీరంగా ఆమె చాలా అంశాలు ప్రస్తావించారు. మిమ్మల్ని చూస్తుంటే నాకు నా కాలేజ్ డేస్ గుర్తుకొస్తున్నాయి. నేనూ మీలాగే సరదాగా ఉండేదాన్ని. కానీ చదువుకుంటుండగానే నాకు చంద్రబాబుతో పెళ్లయిపోయింది. ఆ వయసులో నాకు ఏమీ తెలియదు. అయినా నామీద నమ్మకంతో నా భర్త చంద్రబాబు హెరిటేజ్ ఎండీని చేశారు. ఛాలెంజ్‌గా తీసుకుని పనిచేశా. ఇప్పుడీ స్థితికి చేరుకున్నా. ఎవరైనా సరే, కష్టపడనిదే విజయం ఊరికే రాదు. నా హీరో చంద్రబాబు. ఆయన విజనరీ నాకు ఆదర్శం. భార్యాభర్తల్లో ఎవరైనా ఎదగాలంటే ఎవరో ఒకరు త్యాగం చేయాలి తప్పనిసరిగా. ఆయన నాకిచ్చే సమయం ఉదయం 8.30 గంటలకు. తర్వాత ఆయన తన బాధ్యతల్లో మునిగిపోతారు. ఏదైనా అవసరమై ఫోన్ చేయాలన్నా, పీఏకి చేయాల్సిందే. ఆయన ఫోన్ ఎత్తరు. నేను లోకేశ్ విషయంలో చాలా స్ట్రిక్ట్. నన్ను హిట్లర్ అని పిలిచేవాడు. తన స్నేహితులకు కూడా అలాగే చెప్పేవాడు. చంద్రబాబు రాష్ట్రంకోసం, ప్రజలకోసం పనిచేస్తుంటే సింగిల్ మదర్‌గా పెంచానేమో, లోకేశ్‌ను చాలా క్రమశిక్షణలో పెట్టేదాన్ని. నాడు, నేడు రాజకీయాల్లో ఒక తేడా ప్రధానంగా కనిపిస్తోంది. ఒకప్పుడు లీడర్‌కు అనుచరులు పూర్తి విశ్వాసంగా ఉండేవారు . నేడు ఆ విశ్వాసం, బాధ్యత తగ్గిందనిపిస్తోంది. లోకేశ్ బాబు ప్రజలకు న్యాయం చేస్తాడు. నేను హామీ ఇస్తున్నా. నేను సినిమాలు చాలా తక్కువ చూస్తా. బాలయ్య మూవీలో ఏది నచ్చిందంటే చెప్పలేను. చూసినంతలో సమరసింహారెడ్డి నచ్చిందని చెప్పవచ్చు. డైలాగ్స్ నాకు రావు. అయినా వచ్చినంత చెబుతాను. ఒకేవైపు చూడు, మరోవైపు చూడబాక అనే డైలాగ్. ఏ విషయంలోనైనా ఫోకస్డ్‌గా ఉండాలి. అప్పుడు విజయం వరిస్తుంది. అదే ఈ డైలాగ్‌లో చెప్పారేమో. నేను హైలెవల్ పర్ఫెక్షనిస్టుగా ఉండాలనుకుంటా. అంటే ఏ చిన్న లోపమూ కనిపించకూడదు. ఈ క్రమంలో చాలా అలసిపోతా. ధ్యానం నా స్ట్రెస్ బస్టర్. ఉదయం, సాయంత్రం మెడిటేషన్ చేస్తా. ఇంకా మనవడున్నాడు నాకు. వాడితో టైం స్పెండ్ చేస్తే కూడా ఒత్తిడి తగ్గిపోతుంది. వాడికి అయిదు సంవత్సరాలు వచ్చేవరకు నా మాట వినేవాడు. ఇప్పుడు నేను ఏం చెప్పినా వినడంలేదు. నాతో ఫైటింగ్ ఎక్కువ. ఎందుకొచ్చిన గొడవని వాడి మాట వినడం అలవాటు చేసుకున్నా. నాకు మ్యాథ్స్ ఇష్టం లేదు. హిస్టరీ ఇష్టం. చంద్రబాబు ఎకనామిక్స్ పీజీ చేశారు. ఆ సబ్జెక్టు కూడా ఇష్టం లేదు. చాలా డ్రై సబ్జెక్టు. ఆయన ఎలా మ్యానేజ్ చేశారో. నాకు మొదట్లో కుక్స్ లేరు. నేనే వంట చేసేదాన్ని, డ్రైవింగ్ కూడా నేనే. మా ఆయనకు డబ్బులు సేవ్ చేసేదాన్ని. ఇప్పటికి కూడా నేను 20-30 మందికి వంటచేసి వడ్డించగలను. అయితే లోకేశ్ చిన్నప్పుడు నామీద ఒకటే కంప్లయింట్ చేసేవాడు. ఎవరైనా అడిగితే మా అమ్మ ఏమీ చేయలేదు. ఒట్టి రసమన్నం పెడుతుంది అనేవాడు. నేను ఇల్లు ఊడుస్తుంటే బెడ్ కిందనుంచి బర్గర్ల బాక్సులు బయటపడేవి. వాడికి బర్గర్లు, స్నాక్స్ అంటే అప్పట్లో చాలా ఇష్టం. ఫ్రెండ్స్‌తో తెప్పించుకునేవాడేమో. ఇప్పటికీ లోకేశ్‌తో ఆ విషయం గురించి చెప్పి, నవ్విస్తుంటా. నాకు బహుమతుల మీద ఆశలేదు. ఆయనను ఎప్పుడూ వాటిని గురించి అడగను. అయితే మా ఫ్రెండ్ హజ్బెండ్ ఒకరు మ్యారేజ్ యానివర్శరీకి ఆవిడకు డైమండ్ రింగ్ కొని ప్రజంట్ చేశారట. నాకు చెప్పింది. నేను కూడా మాయానివర్శరీకి డైమండ్ రింగ్ కొనమని అడిగాను. నువ్వే ఒక డైమండ్, నీకు ఇంకా వేరే డైమండ్ ఎందుకన్నారు. అలా చాకచక్యంగా తప్పించుకున్నారన్న మాట. అంతే, అప్పటినుంచి నేను ఆయననుంచి ఏ బహుమతులూ కోరలేదు.

### మానవ తప్పిదం వల్లే కూలిన హెలీకాప్టర్

న్యూఢిల్లీ, త్రివిధ దళాధిపతి జనరల్ బిపిన్ రావత్ ప్రయాణిస్తున్న ఎంఐ 17 వీ5 హెలికాప్టర్ 2021 డిసెంబర్ 8వ తేదీన ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఆ ఘటనలో మొత్తం 12 మంది మరణించారు. బిపిన్ రావత్ భార్య మధులిక రావత్ కూడా ఆ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. తమిళనాడులోని కూనూరులో ఆ ఘటన జరిగింది. ఆ ప్రమాదం పట్ల రక్షణశాఖ స్థాయి సంఘం కమిటీ నివేదికను తయారు చేసింది. ఆ నివేదికను గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మానవ తప్పిదం వల్ల ఎంఐ-17 హెలికాప్టర్ కూలినట్లు రిపోర్టులో వెల్లడించారు. 2017 నుంచి 2022 వరకు భారతీయ వైమానిక దళానికి చెందిన 34 ప్రమాదాలు జరిగినట్లు స్టాండింగ్ కమిటీ రిపోర్టులో పేర్కొన్నారు. ఇక 2021-2022లో జరిగిన 9 ప్రమాదాల్లో.. డిసెంబర్ 8వ తేదీన మానవ ప్రమాదం వల్ల ప్రమాదం జరిగినట్లు తెలిపారు.

# 2020 ఆందోళనను మించి పోరాటం చేస్తాం..



న్యూఢిల్లీ,వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ఫ్రేమ్‌వర్క్ ముసాయిదాను రైతు సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ ప్రతిపాదిత ముసాయిదాపై కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళ్లిన పక్షంలో మూడు నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2020లో నిర్వహించిన ఉద్యమాన్ని మించిన పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ విషయంలో రైతు సంఘాల అభిప్రాయాలను తీసుకునేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి గుర్మీత్ సింగ్ ఖుడియన్ నిర్వహించిన సమావేశంలో రైతు సంఘాల ప్రతినిధులు ఏకకంఠంతో స్పందించారు. సంయుక్త కిసాన్ మోర్చా (పొలిటికల్) అనుబంధంగా ఉన్న 32 రైతు సంఘాలతో మంత్రి సమావేశమయ్యారు. ఈ విధానాన్ని అమల్లోకి తెస్తే 2020 నాటి ఆందోళనకు మించిన స్థాయిలో పోరాటం ఉంటుందనే విషయాన్ని పంజాబ్ ప్రభుత్వం తరఫున కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసినట్టు సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన భారతి కిసాన్ యూనియన్ నేత బల్బీర్ సింగ్ రజేవాల్ చెప్పారు. కొత్త విధానం ద్వారా మార్కెటింగ్‌ను కార్పొరేట్ గద్దలకు అప్పగించాలని కేంద్రం ప్రయత్నిస్తున్నదని ఆయన ఆరోపించారు. వ్యవసాయ మార్కెటింగ్‌ను ప్రయివేటీకరించడాన్ని తాము అనుమతించే ప్రసక్తే లేదని ఆయన చెప్పారు. గతంలో కాకుండా ఇప్పుడు తాము దేశవ్యాప్తంగా సంఘటితంగా ఉన్నామని, గతంలో భారీ ఆందోళనను నిర్వహించి ఉన్నామని ఆయన అన్నారు.ఆహార ధాన్యాల నిల్వకు సిలోస్ (సిలిండర్ ఆకారంలో ఉండే నిల్వ వ్యవస్థలు) నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, కానీ.. అవి ప్రైవేటు రంగంలో కాకుండా.. ప్రభుత్వ రంగంలో ఉండాలని రజేవాల్ తేల్చి చెప్పారు. వ్యవసాయం, మార్కెటింగ్ అనేవి రాష్ట్రాలకు సంబంధించిన అంశాలని తాము కేంద్రమంత్రితో జరిగిన సమావేశంలో గుర్తు చేశామని అన్నారు. సమాఖ్య వ్యవస్థను దెబ్బతీసేలా రాష్ట్రాల హక్కులను కేంద్రం విస్మరిస్తున్నదని విమర్శించారు. కేంద్రం రూపొందించిన ముసాయిదా పత్రాన్ని పంజాబ్ అసెంబ్లీ తిరస్కరిస్తూ తీర్మానం చేయాలని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. కేంద్రం విధానాన్ని ఆమోదిస్తే పంజాబ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కూడా ఆందోళనలు నిర్వహించక తప్పదని చెప్పారు. కేంద్రం గతంలో ఉపసంహరించుకున్న మూడు వ్యవసాయ చట్టాల్లోని అంశాలను దొడ్డిదారిలో ఈ ముసాయిదా విధానం ద్వారా ముందుకు తీసుకు వచ్చేందుకు కుట్ర జరుగుతున్నదని రైతు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.

# బియ్యం అక్రమ రవాణాను అరికడతాం

అమరావతి, ఏపీ సీఎం చంద్రబాబుకృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం గంగూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన తర్వాత, రైతులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. భవిష్యత్తులో ధాన్యం సేకరణ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తానని వెల్లడించారు. "గోనె సంచులు ఎక్కడ నుంచి వెళ్లాయో అనే దానిపై కచ్చితంగా ఉంటాం. బియ్యం అక్రమ రవాణాను అరికడతాం. బియ్యం స్మగ్లింగ్, రీసైక్లింగ్ విషయంలో కఠినంగా ఉంటాం" అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. రైతులు ఏ మిల్లులో ధాన్యం అమ్ముకోవాలనుకుంటే ఆ రైస్ మిల్లులో అమ్ముకోవచ్చని, రైతు అనుకూలతను బట్టి తనే ఎంచుకునే సదుపాయం కల్పిస్తామని చెప్పారు. దళారీ వ్యవస్థపై కచ్చితమైన చర్యలుంటాయని, దళారీ వ్యవస్థ ఉండేందుకు వీల్లేదని స్పష్టం చేశారు. త్వరలో సైలోస్ సిస్టమ్ కూడా రైతులకు అందుబాటులోకి తీసుకుని రావాలని చూస్తున్నాము. సైలోస్ సిస్టమ్ అందుబాటులోకి వస్తే రైతులు కావాల్సిన సమయంలో పంటను అమ్ముకునే అవకాశం ఉంటుంది. దీంతో నిల్వ పెట్టిన ధాన్యానికి ఎక్కువ రేటు వస్తుంది. ఎంటీయూ 1262 గత ఏడాది కృష్ణా జిల్లాలో 3,582 మెట్రిక్ టన్నులు దిగుబడి ఇస్తే.. ఈ ఏడాది 32,859 మెట్రిక్ టన్నులు దిగుబడిని ఇచ్చింది. ఇతర జిల్లాల్లోనూ ఈ పంట దిగుబడి ఎక్కువగా ఉంది... అని చంద్రబాబు వివరించారు. రైతుల ఖర్చు తగ్గించాలి, ఆదాయం పెంచాలి అనేదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఏ సీజన్ లో, ఎలాంటి పరిస్థితుల్లో ఎలాంటి పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుందో రైతులకు వివరిస్తామని అన్నారు. ముఖ్యంగా, పంట చేతికొచ్చాక మార్కెటింగ్ ఎలా చేసుకోవాలో రైతులకు అవగాహన కలిగిస్తామని చెప్పారు. ధాన్యానికి సంబంధించి తేమ శాతం, ఇతరత్రా అంశాల్లో కచ్చితత్వం ఉండడం అవసరమని చంద్రబాబు స్పష్టం చేశారు. గోనె సంచుల పంపిణీలో రైస్ మిల్లులు పొరపాట్లు చేస్తున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో,



5 కోట్ల గోనె సంచులు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గతంలో మార్కెట్ కమిటీల్లో డ్రైయర్లు ఏర్పాటు చేశామని, తేమ ఎక్కువగా ఉన్న చోట్ల డ్రైయర్లు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. 1,713 రైస్ మిల్లులకు గాను 394 మిల్లుల్లో మాత్రమే డ్రైయర్లు ఉన్నాయని వివరించారు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు రైతుకు అవకాశం ఉండాలని భావిస్తున్నామని తెలిపారు. హార్వెస్టర్ యంత్రాలు వచ్చాక రైతులు సంతోషంగా ఉన్నారని, ఎక్కువ దిగుబడికి కారణాలేంటి అనే అంశాలు పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇటీవల డ్రోన్ల ద్వారా పురుగుమందుల పిచికారీ ఎక్కువవుతోందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా అధికారులు పర్యవేక్షిస్తుండాలని సూచించారు.గతేడాది కంటే ఈ ఏడాది, ఈ సమయానికి 40 శాతం ఎక్కువగా ధాన్యం కొనుగోళ్లు జరిగాయని చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటికే 3.20 లక్షల మంది రైతుల నుంచి 21.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రైతులకు 48 గంటల కంటే ముందే ధాన్యం డబ్బులు చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు.

# బీజేపీని వణికించిన శీతాకాలం!



న్యూఢిల్లీ,పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిరవధికంగా శుక్రవారం వాయిదా పడ్డాయి. నవంబర్ 25 నుంచి ప్రారంభమైన ఈ సమావేశాలో బీజేపీ అనుకున్న విధంగా బిల్లులను అయితే పాస్ చేయించుకోలేక పోయింది అని అంటున్నారు. జమిలి ఎన్నికల బిల్లుని ఇదే పార్లమెంట్ లో చర్చకు పెట్టి ఆమోదించుకోవాలని అనుకున్నా విపక్షాల వ్యతిరేకత మధ్యన చివరిలోనే దానిని ప్రవేశపెట్టి జాయింట్ యాక్షన్ కమిటీ ముందుకు పంపించారు.అదే విధంగా వక్ఫ బోర్డు సవరణ బిల్లు చట్టం అవుతుందని శీతాకాల సమావేశాలే దానికి ముహూర్తం అని ప్రచారం సాగినా జేపీసీకి మరో మూడు నెలలు గడువు ఇచ్చి దీని మీద అధ్యయనాన్ని కొనసాగించడానికి వీలు కల్పించారు. ఇక పార్లమెంట్ లో రాజ్యాంగం ఆమోదించి 75 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా చర్చ మాత్రం సాగింది.అయితే ఇక్కడ కూడా అధికార బీజేపీ విపక్ష ఇండియా కూటముల మధ్య విమర్శల జోరే కనిపించింది. రాజ్యాంగాన్ని ఎవరు గౌరవించారు, ఎవరు అవమానించారు అన్న దాని మీద ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేసుకున్నారు.ఇక చూస్తే కనుక శీతాకాల సమావేశాలు ప్రారంభం అవుతూనే అదానీ మీద చర్యలకు డిమాండ్ చేస్తూ సభను స్థంభింప చేసేందుకు విపక్షాలు చూస్తూ వచ్చాయి. దాంతో సభ ప్రతీ రోజూ దాదాపుగా వాయిదా పడుతూనే వస్తోంది. పని గంటలు కూడా గతంతో పోలిస్తే ఈసారి తగ్గాయని అంటున్నారు.ఈసారి పార్లమెంట్ లో రాహుల్ గాంధీ పెద్దగా ఫోకస్ కాలేదు. ప్రియాంకా గాంధీ మొదటిసారి ఎంపీగా నెగ్గి సభకు రావడంతో ఆమె తన ఉనికి బలంగా చాటుకున్నారు. ముఖ్యంగా రాజ్యాంగం మీద చర్చలో ప్రియాంకా గాంధీ మంచి స్పీచ్ ఇచ్చారని ప్రశంసలు వచ్చాయి. అదే విధంగా మోడీ ప్రభుత్వం మీద ఆమె ధీటైన విమర్శలు చేశారు అని కూడా అంటున్నారు.ప్రధాని మోడీ ఈ సారి సమావేశాలలో రాజ్యాంగం మీద చర్చలోనే కీలకమైన ప్రసంగం చేశారు. అయితే గత సమావేశాలతో పోల్చితే ఈసారి మోడీ మార్క్ అయితే అంతగా కనిపించలేదు అనే అంటున్నారు. ఈసారి మొత్తం సమావేశాలలో హైలెట్ ఏంటి అంటే బీజేపీలో ఎన్డీయేలో కీలకమైన బలమైన నేతగా ఉన్న అమిత్ షాను ఇరుకున పెట్టడం. ఆయన అంబేద్కర్ మీద చేసిన వ్యాఖ్యలు అంటూ విపక్షాలు సభ లోపలా బయటా కూడా ఆందోళనలు చేశాయి. బహుశా ఈ ఆందోళనలు శీతాకాలం సమావేశాలు పూర్తి అయినా మరింత కాలం కొనసాగే అవకాశాలు అయితే ఉండొచ్చు.అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఒకటి అయితే వేరేగా చిత్రీకరించింది మరోటి అని బీజేపీ నేతలు అంటున్నారు. ఏది ఏమైనా మోడీ తరువాత అంతటి లీడర్ అయిన అమిత్ షా పదేళ్ళ పార్లమెంటరీ అనుభవం లో తొలిసారి విపక్షాలకు ఇలా దొరికి ఇబ్బంది పడ్డారు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే ఎన్డీయే ప్రభుత్వాన్ని అదాని ఇష్యూతో మొదలెట్టి అంబేద్కర్ ఇష్యూ దాకా లాగి విపక్షం అయితే వణికించింది అని విశ్లేషిస్తున్నారు.ఈసారి సమావేశాలలో అయితే బీజేపీ అనుకున్నది సాధించలేకపోయిందా అన్న చర్చ సాగుతోంది. విపక్షం మాత్రం తాము అదానీకి మోడీ సర్కార్ కి అండగా ఉందని ఎస్టాబ్లిష్ చేయగలిగామని అలాగే అంబేద్కర్ విషయంలో బీజేపీ మనువాద ధోరణిని ఎండగట్టామని సంతృప్తి వ్యక్తం చేస్తోంది.ఎవరు ఏమి అనుకున్నా ఈసారి శీతాకాల సమావేశాలు మాత్రం ప్రజా సమస్యల మీద పెద్దగా చర్చించలేదని అంటున్నారు. మేధావులు, రాజకీయ నిపుణులు పెదవి విరుస్తున్నారు. సభలలో రచ్చ రభస ఎక్కువ అవుతోందని, ఆఖరికి పార్లమెంట్ బయట బాహాబాహీ వంటి దృశ్యాలు కూడా గతంలో చూడనివి చోటు చేసుకుంటున్నాయని ప్రజాస్వామ్య ప్రియులు అయితే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం

అమరావతి: పశ్చిమ మధ్య- ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. రానున్న 12 గంటల్లో ఉత్తరం వైపు కదులుతూ పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. తదుపరి 24 గంటల్లో ఉత్తర-ఈశాన్య దిశగా వాయుగుండంగా కదిలే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఉత్తర, కోస్తా జిల్లాలో భారీ వర్షాలు పడతాయని తెలిపారు. రానున్న 24 గంటల్లో ఏపీలోని కాకినాడ, అల్లూరి, అనకాపల్లి, విశాఖ, మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు.తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు గరిష్ఠంగా 60 కిలోమీటర్లు వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. రానున్న రెండు రోజులుపాటు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. కళింగపట్నం నుంచి మచిలీపట్నం వరకు ఉన్న అన్ని పోర్టులలో 3వ నెంబర్ ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. గడిచిన 24 గంటలలో విజయనగరం జిల్లా మెంటాడలో 6 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. 'పశ్చిమ మధ్య- ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. దీని ప్రభావం ఉత్తర కోస్తా జిల్లాల్లో ఉంటుంది. ఉత్తర ఆంధ్రలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

# మెట్రో కోచ్‌ల సంఖ్యను పెంచే యోచనలో ప్రభుత్వం

హైదరాబాద్, హైదరాబాద్ మెట్రో రైలు కొద్దికాలంలోనే విశేష ప్రజాదరణ పొందింది. ట్రాఫిక్, కాలుష్య రహితమైన ప్రయాణాన్ని అందిస్తూ విభిన్నవర్గాలకు చేరువైంది. ప్రయాణికులకు మెరుగైన రవాణా అందిస్తూ రికార్డ్‌లు క్రియేట్ చేస్తోంది. నిత్యం 5 లక్షల మందికి పైగా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేస్తోంది హైదరాబాద్ మెట్రో. ఏడేళ్లు పూర్తి చేసుకున్న హైదరాబాద్ మెట్రో ఎన్నో మైలురాళ్లను క్రియేట్ చేసింది. ఏడేళ్ల క్రితం భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభమైన హైదరాబాద్ మెట్రో రైలులో ఇప్పటివరకు 63 కోట్ల మందికి పైగా ప్రయాణం చేశారు. సగటున ప్రతిరోజు 4.75 లక్షల మంది మెట్రో ప్రయాణం చేస్తుండగా.. గరిష్టంగా 5.63 లక్షల మంది ప్రయాణికులుగా జర్నీ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మెట్రో ప్రాజెక్టుల్లో ఢిల్లీ మెట్రో ప్రథమ స్థానంలో ఉంటే.. హైదరాబాద్ మెట్రో మూడోస్థానంలో కొనసాగుతోంది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టంలో మెట్రో రైళ్లు బ్యాక్ బోన్‌గా ఉంటున్నాయి. ప్రారంభంలో మెట్రో ప్రయాణాలపై అంతగా ఆసక్తి చూపని నగరవాసులు.. ఆ తర్వాత మెల్ల మెల్లగా మెట్రో ప్రయాణం వైపు మొగ్గు చూపారు. ప్రస్తుతం ఎల్బీనగర్-మియాపూర్, నాగోల్-రాయదుర్గం, జేబీఎస్-ఎంజీబీఎస్ మూడు కారిడార్లలో సేవలందిస్తోంది హైదరాబాద్ మెట్రో. ప్రస్తుతం మూడు కారిడార్లలోనూ ప్రయాణికుల రద్దీ ఎక్కువగానే ఉంటోంది. హైదరాబాద్ మహానగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను అధిగమిస్తూ, వేగంగా ప్రయాణించేందుకు ఎక్కువ శాతం మెట్రోను ఆశ్రయిస్తున్నారు. వీరితోడు ఉద్యోగులు, విద్యార్థులు సైతం ప్రయాణాలకు ఇష్టపడుతున్నారు. దీంతో మెట్రో రైలులో సైతం విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. బిజినెస్ వేళల్లో కనీసం కాలు నిలపలేని పరిస్థితి. ప్రస్తుతం ట్రైన్లలో కూర్చుని ప్రయాణాలు చేసేందుకు ఏమాత్రం అవకాశం దొరకడం లేదు. ఈ క్రమంలోనే మెట్రో కంపార్ట్‌మెంట్ల సంఖ్య పెంచాలని ప్రయాణికులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. మెట్రో ప్రయాణికుల రద్దీపై రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో కోచ్‌ల సంఖ్యను పెంచే యోచనలో ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం



హైదరాబాద్ మెట్రో రైల్ 3 కోచ్‌లతో నడుస్తోంది. కావున రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు కోచ్‌లను ఏర్పాటు చేయాలన్న అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మెట్రోను 3 కోచ్‌లతో నడిపేందుకు డిజైన్ చేసినట్లు తెలిపిన మంత్రి.. దాన్ని 6 కోచ్‌లుగా మార్చేందుకు ప్లాన్ చేస్తున్నామన్నారు. త్వరలోనే ఆరు కోచ్‌లుగా అప్‌గ్రేడ్ చేసేందుకు మెట్రో అధికారులు, ఎల్ అండ్ టీ యాజమాన్యంతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. కోచ్‌ల పెరిగితే, హైదరాబాద్ మెట్రోలో ప్రయాణికుల రద్దీ తగ్గుతుందని, కూర్చొని ప్రయాణించే వీలు కలుగుతుందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.ఇక మెట్రో సెకండ్ ఫేజ్‌కు కూడా రేవంత్ సర్కార్ సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే! రెండో దశలో చేపట్టబోయే పనులపై డీపీఆర్ రెడీ అయింది. శంషాబాద్ విమానాశ్రయం వరకు నిర్మించేందుకు ప్రతిపాదించిన మెట్రో మార్గం.. పలు ప్రత్యేకతల సమాహారంగా ఉండబోతోంది. ఎయిర్‌పోర్ట్ కారిడార్‌లో అండర్ గ్రౌండ్ మార్గం నిర్మించేలా ప్రణాళిక రెడీ చేశారు. నాగోల్-ఎయిర్‌పోర్ట్, రాయదుర్గ్-కోకాపేట్, ఎంజీబీఎస్-చంద్రాయణగుట్ట, మియాపూర్-పటాన్‌చెరు, ఎల్‌బీనగర్-హయత్‌నగర్, మియాపూర్ %-% పటాన్‌చెరు వరకు అవకాశం ఉన్న చోట డబుల్ డెక్కర్ నిర్మిస్తారు. రెండో దశలో ప్రతి కిలో మీటరుకు రూ.318 కోట్లు ఖర్చు అవుతుంది.

# ధరణి పేరుతో నిరుపేదల ఆస్తులు కొల్లగొట్టారు



హైదరాబాద్, తెలంగాణలో ధరణి పోర్టల్ తీసుకొచ్చి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే ఈ చట్టాన్ని రద్దు చేసి భూ భారతీ తీసుకొచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ధరణి అక్రమాలపై దృష్టి పెట్టింది. ఈ చట్టం పేరుతో చేసిన కబ్జాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఫోరెన్సిక్ విచారణ చేస్తున్నట్టు సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. 'ధరణి'పై పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో 1 లక్షా 50 వేల కోట్ల విలువ చేసే భూములు చేతులు మారాయని మంత్రి పొంగులేటి ఆరోపించారు. లిటిగేషన్‌లో ఉన్న భూములను పార్టీ-బీ లో పెట్టి ఆ భూములను సక్రమం చేసుకున్నారని దోచిన భూములను బీఆర్ఎస్ నేతలు తమ అస్మదీయులకు విచ్చలవిడిగా రిజిస్ట్రేషన్లు చేశారన్నారు. కొన్నిచోట్ల భూములకు యజమానులు ఇక్కడ లేరని .. దేశ విభజన సమయంలో పాకిస్తాన్ వెళ్లిపోయారని, అధికారులు నో అబ్జెక్షన్ అని చెప్పారంటూ ఆ భూములను కూడా కాజేశారని పేర్కొన్నారు. ధరణి వల్ల అక్రమంగా రిజిస్ట్రేషన్ అయిన భూమి ముగ్గురు, నలుగురు వ్యక్తులు మీద మాత్రమే బదలాయింపు అయిందని ఆరోపించారు. ధరణి పేరుతో నిరుపేదల ఆస్తులను కూడా కొల్లగొట్టారన్నారు. అలాగే ధరణి వల్ల సుమారు 25 వేల ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాని ప్రభుత్వం భావిస్తోంది. ఒక్క ఇబ్రహీంపట్నం పరిధిలోనే 10 వేల ఎకరాలు అన్యాక్రాంతం చేశారని ప్రభుత్వ వర్గాలంటున్నాయి. అక్కడ ఎకరా రూ.10 కోట్ల విలువ ఉంటుందని న్యాక్రాంతమైన 25 వేల ఎకరాల భూముల మొత్తం విలువ రూ.2.50 లక్షల కోట్లుగా అంచనా వేస్తున్నారు. ధరణి మసుగులో జరిగిన భూ ఆక్రమనలన్నీ బయట పెడతామని, దీని వెనకాల ఎంత పెద్దవారున్నా వదిలే ప్రసక్తేలేదని ఇప్పటికే పలు సందర్భాలలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. గత పదేళ్లలో చోటు చేసుకున్న భూ ఆక్రమణల మీద సమగ్ర విచారణ చేయడానికి సిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అసెంబ్లీలో దీనిపై ప్రకటన చేయలేదు కానీ రేపో మాపో ఉత్తర్వులు జారీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో చేసిన తప్పులను సరిదిద్దుకోకుండా భారాస సభ్యులు వక్రబుద్ధితో వ్యవహరిస్తున్నారని తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. 'భారాస సభ్యులు భూ భారతి బిల్లును ఆమోదించకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. వారి తీరు సభ్యసమాజం సిగ్గుపడేలా ఉంది. సభలో గూండాగిరి, దౌర్జన్యం, రౌడీయిజం లేకుండా స్పీకర్ చర్యలు చేపట్టాలి. భారాస హయాంలో తీసుకొచ్చిన 'ధరణి' పోర్టల్ తప్పులతడకగా ఉందని కేసీఆర్‌కు తెలుసు. ఆయన 80వేల పుస్తకాలు చదివారు. పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించి ధరణి పోర్టల్ రూపొందించారని అనుకునేవాళ్లం. ఆ చట్టానికి మూడేళ్లకే వందేళ్లు నిండాయి. ఇందిరమ్మ రాజ్యంలో 1971లో చేసిన చట్టం.. 49 ఏళ్లుగా ప్రజల్లో ఉంది. భూ భారతి బిల్లుకు సంబంధించి భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు అనేక సూచనలు ఇచ్చారు. ఈ బిల్లు సభలో ప్రవేశపెట్టినప్పుడు ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా సూచనలు చేస్తారని ఆశించాం. అవి చట్టంలో పొందుపరచాలని భావించాం. కేసీఆర్ రాలేదు.. సభలో ఉన్నవాళు ఈరకంగా గొడవ చేస్తున్నారు. భారాస చిల్లర వేషాలను ప్రజలు హర్షించరు' అని పొంగులేటి వ్యాఖ్యానించారు. అంతకుముందు హరీశ్‌రావు తీరుపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారాస సభ్యుల ఆందోళన సందర్భంగా స్పీకర్ మాట్లాడారు. 'హరీశ్‌రావు తీరు రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేసేలా ఉంది. సభను తప్పుదోవ పట్టించడం సరికాదు. భూ భారతి ముఖ్యమైన బిల్లు. ప్రజలకు సంబంధించిన బిల్లులపై చర్చల సమయంలో ఇలా ప్రవర్తించడం సరికాదు. ఈ బిల్లు ఇష్టం లేదా? రైతులకు సాయం చేయడం ఇష్టం లేదా?'అని స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# అమెరికాలో జాకీర్ హుస్సేన్ అంత్యక్రియలు..

వాషింగ్టన్, ప్రముఖ తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ అంత్యక్రియలు అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్‌కోలో జరిగాయి. తమ అభిమాన విద్వాంసుడిని చివరిసారి చూసేందుకు.. నివాళులు అర్పించేందుకు వందలాదిమంది అభిమానులు తరలి వచ్చారు. ఊపిరితిత్తుల సమస్యతో బాధపడిన 73ఏళ్ల జాకీర్ హుస్సేన్ ఈ నెల 16న తుదిశ్వాస విడిచిన విషం. శాన్ ఫ్రాన్సిస్కోలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన చనిపోయారు. దీంతో నేడు శాన్ ఫ్రాన్సిస్‌కోలోని ఫెర్న్ వుడ్ శ్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు జరిగాయి.ప్రఖ్యాత తబలా విద్వాంసుడు ఉస్తాద్ అల్లా రఖా (ఉస్తాద్ అల్లా రఖా) తనయుడే జాకీర్ హుస్సేన్. జాకీర్ 1951 మార్చి 09న ముంబైలో జన్మించాడు. తన తండ్రిని తబల వాయించడం చూసి మూడేళ్లకే తబల పట్ల ఆసక్తిని పెంచుకున్నాడు. ఈ మూడు వయసులోనే తబల పట్టి ఏడేళ్ల వయసులోనే వాద్యంపై పట్టు సాధించడంతో పాటు ప్రదర్శనలు ఇచ్చారు. సంగీత కచేరిలు కూడా నిర్వహింపబడ్డాయి.12 ఏండ్ల వయసుకే.. అంతర్జాతీయ సంగీత ప్రదర్శనలు ఇచ్చిన విద్వాంసుడిగా చరిత్ర సృష్టించాడు. హిందుస్తాని క్లాసికల్ మ్యూజిక్, జాజ్ ఫ్యూజన్‌లో నైపుణ్యం సాధించి తిరుగులేకుండా అయ్యాడు. ఒకవైపు సంగీతంలో తన ముద్రవేస్తునే.. ఏకనామిక్స్‌లో డిగ్రీ పట్టా అందుకున్నాడు. ఆయనకు భార్య ఆంటోనియా మిన్నెకోల కుమార్తెలు అనీసా ఖురేషి, ఇసాబెల్లా ఖురేషి ఉన్నారు. క్లాసికల్ డాన్సర్ అయిన ఆంటోనియాను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు జాకీర్. ఆరు దశాబ్దాల సంగీత ప్రయాణంలో హుస్సేన్ అనేకమంది ప్రఖ్యాత అంతర్జాతీయ కళకారులతో పనిచేశారు.1973లో ఇంగ్లీష్ గిటారిస్ట్ జాన్ మెక్లఫ్లిన్, వయోలిన్ వాద్యకారుడు ఎల్ శంకర్, పెర్క్యూషనిస్ట్ ప్లేయర్ టి హెచ్ విక్కు వినాయ'క్‌తో కాలిసి హిందుస్తాని క్లాసికల్ మ్యూజిక్, జాజ్ ఫ్యూజన్‌లో ఆయన సంగీత ప్రదర్శన ఇచ్చాడు. తన కెరీర్‌లో పండిట్ రవిశంకర్, అలీ అక్బర్ ఖాన్ శివకుమార్ శర్మలతో పాటు అనేక దిగ్గజాలతో కలిసి పనిచేశాడు. భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని అంతర్జాతీయ ప్రేక్షకులకు చేరువ చేయడంలో ఆయనవంతు కృషిని అందించారు. సంగీతం



రంగంలో ఆయన అందించిన సేవలను భారత్‌తో పాటు ప్రపంచం గుర్తించింది. ప్ర ముఖ తాజ్ మహల్ టీ ఫేమస్ అవ్వడానికి ముఖ్య కారణం. జాకీరే.. 1980లో ఈ యాడ్ కోసం అప్పట్లోనే రూ.50000 పారితోషికం అందుకొని రికార్డు సాధించాడు.జాకీర్ హుస్సేన్ ఇప్పటివరకు నాలుగు గ్రామీ అవార్డులు అందుకోగా.. భారత ప్రభుత్వం అతడిని.. 1988లో పద్మశ్రీ, 2002లో పద్మభూషణ్.. 2023లో పద్మవిభూషణ్‌లతో సత్కరించింది. అమెరికా & భారతదేశం మధ్య సంబంధాలలో అతని సాంస్కృతిక సహకారానికి గుర్తింపుగా 1990లో ఇండో-అమెరికన్ అవార్డును ప్రదానం చేశారు. ఇంకా ఇవే కాకుండా.. శాన్ ఫ్రాన్సిస్కో జాజ్ సెంటర్ హుస్సేన్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ఇచ్చింది. ముంబై విశ్వవిద్యాలయం 2022లో సంగీత రంగంలో ఆయన చేసిన విశేష కృషికి గౌరవ డాక్టర్ ఆఫ్ లా డిగ్రీని ప్రదానం చేసింది.

### గర్ల్‌ఫ్రెండ్‌తో వెళ్లిపోయిన భార్య..హైకోర్టును ఆశ్రయించిన భర్త

అహ్మదాబాద్,గర్ల్‌ఫ్రెండ్‌తో వెళ్లిపోయిన భార్యను వెతికి పెట్టాలంటూ ఒక వ్యక్తి గుజరాత్ హైకోర్టును ఆశ్రయించాడు. స్వలింగ సంపర్కురాలైన తన భార్య అక్టోబర్‌లో తన ప్రియురాలితో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయిందని, ఆ సమయానికి ఆమె ఏడునెలల గర్భవతి అని ఆయన కోర్టుకు విన్నవించాడు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com